thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

ఆసియా క్రీడలకు భారత మహిళా క్రికెట్ జట్టు




11

# చురకలు

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 93 | జగిత్యాల | బుధవారం | 01 జూలై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |




## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

- హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం
- గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

# ఏముందో అదే చెబుతా.. చెప్పిందే చేస్తా



- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నా రాజకీయ జీవితం
- బెల్టు షాపులు తప్ప కేసీఆర్ పాలనలో వచ్చినవేమీ లేవు
- 'కాళేశ్వరం' నుంచి నీరు తీసుకోకున్నా పంటలు పండాయి
- వైఎస్సార్ రైతులకు విద్యుత్ బిల్లులు మాఫీ చేశారు
- రైతు భరోసా ఖరీఫ్ నిధుల విడుదల సభలో సీఎం
- భవిష్యత్తులో పంట వేసిన రైతులకే భరోసా: మంత్రి తుమ్మల

హైదరాబాద్

'అధికారం కోసం అబద్ధాలు చెప్పను. ఏముందో అదే చెబుతా... చెప్పిందే చేస్తా. అబద్ధాల పునాదులపై ప్రభుత్వం నడపను. ఈ ప్రభుత్వం రైతులది, పేదలది, మహిళలది, నిరుద్యోగులది. పదవి శాశ్వతం కాదు... మాట శాశ్వ తం. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నా రాజకీయ జీవితం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబా ద్‌లోని శిల్పకళా వేదికలో రైతు భరోసా పథకం కింద ఖరీఫ్ పెట్టుబడి - మిగతా 2లో



## హర్మ్మూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం


- పశ్చిమాసియా తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ప్రధాని మోదీ చర్చ
- హర్మ్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌తో పాటు ప్రపంచానికి కీలకమని స్పష్టం
- హర్మ్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని!
- అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి

3

# ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యంగా



- కేంద్ర కార్యదర్శులతో ప్రధాని సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆత్మనిర్భర్ భారత్‌పై ప్రధాని నరేంద్ర మోదీ సమీక్ష
- ప్రభుత్వ పథకాల ప్రభావం ప్రజల జీవితాల్లో స్పష్టంగా కనిపించాలని ఆదేశం
- మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలి




## ఇథనాల్ కేటాయింపుల వివాదం

- కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు 'స్టేటస్ కో'!
- కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్
- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించకుండా నేరుగా ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ పిటిషనర్లను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

4



## గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర

- జులై 1 నుంచే వీబీజీ రామ్‌జీ చట్టం అమలు
- రూ.కోట్లల్లో బకాయిలు చెల్లించలేదని కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- రాష్ట్రాలపై భారం పెరుగుతుందని, బకాయిలు చెల్లించలేదని కాంగ్రెస్ ఆరోపణలు

3

# సాదాబైనామా భూముల సమస్యకు చెక్

- అర్హులైన వారికి పట్టాదారు హక్కులు
- ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల నోటీసులు జారీ
- గ్రామస్థాయి విచారణ నిర్వహించి భూములపై అభ్యంతరాల స్వీకరణ
- సాదాబైనామాలకు భూభారతిలో ఇప్పటికే 3.65 లక్షలకుపైగా పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ




హైదరాబాద్

తెలంగాణలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా భూముల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. 9.25 లక్షల దరఖాస్తులను పరిశీలించి 6 లక్షలకుపైగా నోటీసులను రెవెన్యూ శాఖ జారీ చేసింది. నిర్ణీత గడువులోగా విచారణలు పూర్తి చేసి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందజేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణలో సాదాబైనామా భూముల సమస్య దశాబ్దాలుగా రైతులను వెంటాడుతోంది. అధికారిక రిజిస్ట్రేషన్ లేకుండా తెల్ల కాగితాలపై జరిగిన భూముల క్రయవిక్రయాలు అధికారిక రికార్డుల్లో నమోదు కాకపోవడంతో లక్షలాది మంది రైతులు తమ భూములపై చట్టబద్ధమైన హక్కులు పొందలేకపో యారు. రాష్ట్రవ్యాప్తంగా 9.25 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వారు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పంట బీమా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. 2020లో అప్పటి బీఆర్ఎస్ - మిగతా 2లో



## రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం

- దేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, జాతీయ భద్రతే మూలస్తంభాలు
- దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయి
- వడోదరలో వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ మంత్రి ప్రసంగం
- 2003లో ప్రారంభమైన వైబ్రంట్ గుజరాత్ ఇప్పుడు వికసిత్ భారత్ లక్ష్యానికి జాతీయ ఉద్యమంగా మారిందన్న రాజ్‌నాథ్

3

# రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్లు

- రైతు భరోసాతో తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక కానుక
- ఖరీఫ్ నుంచే 7 రకాల సన్న వడ్లకు బోనస్
- రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- రెండున్నరేళ్లలో రైతుల కోసం రూ.80 వేల కోట్ల వ్యయం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్

తెలంగాణ రైతాంగం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయం అమలు చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన రైతు భరోసా సదస్సులో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులతో కలిసి పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ రోజు నుంచే రాష్ట్రవ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను నేరుగా జమ చేస్తున్నామని ప్రకటించారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని... రైతు నవ్వితేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని" అన్న నమ్మకంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల్లో - మిగతా 3లో

# ఏముందో అదే చెబుతా... చెప్పిందే చేస్తా

-మొదటిపేజీ తరువాయి

సాయం విడుదల సందర్భంగా నిర్వహించిన రైతు భరోసా సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ మళ్లీ వస్తాడని ఇద్దరు పిల్ల రాక్షసులు చెబుతున్నారని.. ఆయన రావడం వల్ల ఆ కుటుంబానికే ఉపయోగం తప్ప ప్రజలకు ఒనగూరేదేముందని సీఎం ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారని.. అయితే బెంగాల్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీకి 15 ఏళ్లు పట్టిందని.. ఇక్కడ కూడా అలాగే వేచి ఉండాలని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని చెప్పారు. రైతుల కోసం ప్రతినెలా రూ. 6 వేల కోట్ల చొప్పున గత 30 నెలల్లో రూ. 1.75 లక్షల కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పంటా కాళేశ్వరం నీళ్లతోనే పండుతోందని బీఆర్ఎస్ నేతలు చెప్పుకొనే వాళ్లని.. కానీ మూడేళ్లుగా అక్కడి నుంచి చుక్క నీరు రాకపోయినా తెలంగాణ రైతులు 2 కోట్ల 80 లక్షల టన్నుల ధాన్యం ఎలా పండించారో చెప్పాలని సీఎం ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో వరి పండించి క్వింటా రూ. 4,200కు అమ్ముకున్నాయన వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టారని విమర్శించారు.



### కేసీఆర్ మళ్లీ వస్తాడా... ఎందుకు?

ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో అయిన అప్పు రూ. 69 వేల కోట్లు అయితే, పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం రూ. 7 లక్షల కోట్లకుపైగా అప్పు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు కూడా విడతలవారీగా ఇచ్చారని.. బడి పిల్లల భోజన బిల్లులు, యూనిఫాం బిల్లులు, స్వయం సహాయక సంఘాల బకాయిలు, సర్పంచుల బిల్లులు... ఇలా ఏ ఒక్కటీ చెల్లించకుండా వెళ్లిపోయారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు అయిందో లేదో అప్పుడే దిగిపోవాలంటున్నారని.. అడగగానే దిగిపోవడానికి తాము గడీల ముందు బానిసలమా? అని సీఎం ప్రశ్నించారు. 'కేసీఆర్ మళ్లీ వస్తే ప్రజలకు ఏం చేస్తడు. ప్రజలకేం ఇచ్చిండని వస్తడు? మొగుడు పెళ్లాలు మాట్లాడుకునే మాటలు వినడానికా? రైతు బజార్లు తీసుకురావాల్సింది పోయి బెల్టు షాపులు తీసుకొచ్చారు. రాష్ట్రంలో తాగుడు సంస్కృతిని పెంచారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. దళితులకు 3 ఎకరాల చొప్పున భూపంపిణీ ఇవ్వలేదు. రూ. లక్ష చొప్పున రైతులకు రుణమాఫీ చేయలేదు. మేం సంసారాల్లో చిచ్చుపెట్టే తప్పుడు రాజకీయాలు చేయం. ఫోన్ ట్యాపింగ్ లాంటి పనులు మా ప్రభుత్వంలో ఉండవు'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

### మోదీ వచ్చి మోరీ తీస్తడా?

'తెలంగాణలో కూడా మోదీ పాలన వస్తదని బీజేపీ నేతలు అంటున్నారు. అయినా మోదీ వచ్చి మోరీ తీస్తాడా? ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోదీ చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ లెక్కన 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు రావాలి. ఎక్కడ ఉన్నాయి ఆ ఉద్యోగాలు? తెలంగాణలో బండి సంజయ్, కిషన్‌రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు'అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

### ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్

'ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్. వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత విద్యుత్‌పై సంతకం చేశారు. రూ. 12 వేల కోట్ల విద్యుత్ బిల్లులను కూడా మాఫీ చేశారు. ఎవరైనా ఉచిత విద్యుత్ ఇచ్చామంటే ఉరికించి కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు కూడా ఉచిత విద్యుత్ కోసం గత 30 నెలల్లో రూ. 30 వేల కోట్లు వెచ్చించాం. ప్రతిపక్ష నాయకులు మూసీ అభివృద్ధి వద్దంటారు... మెట్రో వద్దంటారు... రీజనల్ రింగ్ రోడ్ వద్దంటారు... పొర్లు దండాలు పెట్టినా అభివృద్ధి పనులు ఆపం'అని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.

### పంట మార్పిడి తప్పనిసరి

ఈసారి వర్షాలు తక్కువగా పడే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నందున వర్షాలను బట్టి రైతులు పంటలు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 'మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాం. రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు వేయాలి. పంట మార్పిడి చేయాలని శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు నేను చెబితే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అబద్ధాలు చెప్పుకుంటూ బతకాలనే శాపం బావబామ్మర్దులకు ఉన్నట్లుంది. అందుకే పోటీ పడి అబద్ధాలు చెబుతున్నారు. ఎవరేం చెప్పినా 9 రోజుల్లో రైతుభరోసా కింద రూ. 9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

### భూమి భరోసా కాదు... పంటకు భరోసా: మంత్రి తుమ్మల

భవిష్యత్తులో పంట వేసిన వారికే రైతు భరోసా అందించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ఇది భూమి భరోసా కాదని, పంటకు ఇచ్చే భరోసా అని స్పష్టం చేశారు. పంటల మార్పిడి చేయాలని, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు పప్పు దినుసులు పండించాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా, రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపులతో రైతుల జీవితాల్లో నమ్మకాన్ని నింపామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితోపాటు రైతు వేదికల నుంచి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ


**హైదరాబాద్ :** ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్--2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ ఢిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, "ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా" అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. "ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి" అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్--16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. "'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది" అని పేర్కొన్నారు. స్పెయిన్‌కు చెందిన ITP Aero, కెనడాకు చెందిన FTG Aerospace వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్‌ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు.




డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌర-సైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు. ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం మీకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వం" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. "ఏరోమార్ట్ హైదరాబాద్--2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## వరంగల్ కొత్త మాస్టర్ ప్లాన్

**వరంగల్ :** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో రాబోయే కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రతిపాదనలపై స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇన్వెస్టర్లలో ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తోంది. నగరాభివృద్ధి సంస్థ కుడా ప్రతిపాదిస్తున్న నూతన మాస్టర్ ప్లాన్ మార్పుల తాలూకు లీకేజీలు, ఊహాగానాలు మార్కెట్ వర్గాల్లో ఒక రకమైన ఉత్కంఠను రేపుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా తుది ప్లాన్‌ను ప్రకటించక ముందే వేర్వేరు జోన్లపై వస్తున్న లీకేజీల వల్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. ఈ తాజా పరిణామాలతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల కొనుగోళ్లు తాత్కాలికంగా మందగించాయి. వ్యవసాయ జోన్ ఎటు మారుతుంది? గ్రీన్ జోన్, కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్ల సరిహద్దులు ఎక్కడ ఖరారవుతాయి? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. ఏ ఒక్క జోన్ తారుమారైనా తాము పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి చిక్కుల్లో పడుతుందనే అయోమయంతో ఇన్వెస్టర్లు, అటు నాలా కన్వర్షన్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లు తమ కొత్త వెంచర్ల లాంచింగ్‌లను కొద్దిరోజుల పాటు హోల్డ్‌లో పెట్టారు. ఔటర్ పరిసరాల్లో ఈ విధమైన నిస్తేజం కనిపిస్తున్నప్పటికీ, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఏరియాల్లో మాత్రం స్థిరాస్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నగర నడిబొడ్డున , ఐఆర్ఆర్ కనెక్టివిటీ ఉన్న ప్రధాన లేఅవుట్లలో ఎలాంటి జోనింగ్ భయాలు లేకపోవడంతో గజం ధరలు యథాతథంగా ఉన్నాయి. పైగా, భవిష్యత్తులో మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే నగర కేంద్రంలో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందనే అంచనాతో ఇన్నర్ ఏరియాల్లో ఉన్న బిట్లను దక్కించుకోవడానికి కొందరు మదుపరులు ఇప్పటికీ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ గందరగోళానికి తెరపడాలంటే ప్రభుత్వం త్వరితగతిన కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను అధికారికంగా విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని స్థానిక రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. ప్లాన్‌పై పూర్తి స్థాయి పారదర్శకత వస్తేనే గ్రేటర్ వరంగల్ పరిధిలో మళ్లీ ప్లాట్ల క్రయవిక్రయాలు ఊపందుకుంటాయని, అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడి మార్కెట్‌లో నమ్మకం పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు.



## రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన ప్రతి రైతు హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం ఇదేనని అన్నారు. ఖరీఫ్ సీజన్ నుంచే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏడు రకాల సన్న వడ్లకు బోనస్ అందిస్తామని ప్రకటించిన మంత్రి, రైతు పండించిన ప్రతి గింజకు విలువ పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ధాన్యం ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు అనుకూల విధానాలు, సకాలంలో ధాన్యం కొనుగోలు, వేగంగా రైతుల ఖాతాల్లో చెల్లింపులు, నాణ్యమైన విత్తనాలు, సాగునీటి లభ్యత వంటి చర్యలతో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రైతు సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపులతో రైతుల జీవితాల్లో నమ్మకాన్ని నింపామని చెప్పారు.

రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి రైతు సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.80 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని, ఇది దేశంలోనే రైతు సంక్షేమంపై అత్యధిక పెట్టుబడి పెట్టిన ప్రభుత్వాల్లో తెలంగాణను నిలబెట్టిందని తెలిపారు. "మాటలు కాదు... చేతలు. హామీలు కాదు... అమలు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేకత" అని మంత్రి పేర్కొన్నారు. రైతు కష్టానికి గౌరవం, పంటకు గిట్టుబాటు ధర, సాగుకు భరోసా, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగం కోసం ప్రతి నిర్ణయం తీసుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతు సంక్షేమం, రైతు గౌరవం, రైతు ఆర్థికాభివృద్ధే తమ ప్రభుత్వ పరమావధి అని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## సాదాబైనామా భూముల సమస్యకు చెక్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం దరఖాస్తులను స్వీకరించింది. అయితే న్యాయపరమైన వివాదాలు, చట్టపరమైన అడ్డంకులు ఎదురుకావడంతో సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఏ మాత్రం ముందుకు సాగలేదు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అలాగే సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక నిబంధనలు రూపొందించింది.

**6 లక్షల మందికి నోటీసులు**

సాదా బైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన వారిలో అర్హత కలిగిన చిన్న, సన్నకారు రైతులకు ఆ భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మందికి నోటీసులు జారీ చేయగా మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**అర్హులైన వారికి పట్టా పాస్‌బుక్‌లు**

సాదాబైనామా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అర్హత ఉన్న దరఖాస్తులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో గ్రామస్థాయిలో విచారణలు నిర్వహించి సంబంధిత భూములపై అభ్యంతరాలను స్వీకరించి, నిశితంగా పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి సెక్షన్ 13(బీ) ప్రక్రియ ద్వారా సంబంధిత భూములపై పట్టాదార్ హక్కులు కల్పిస్తారు.

**3 లక్షల మందికి పైగా పట్టాలు జారీ**

భూభారతి అమలులో భాగంగా సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ప్రభుత్వం దానిని దశల వారీగా అన్ని జిల్లాలకు విస్తరించాలని నిర్ణయించింది. భూమి సర్వే, స్టాంపులు- రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డులను ఒకే వ్యవస్థలో సమన్వయం చేయడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 3.65 లక్షలకుపైగా పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు ప్రభుత్వ అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

## గుర్రంగూడ ఫారెస్ట్ లో కేబీఆర్ తరహా ఎకో పార్కు..


**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు తరహాలో అధునాతన ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ పనులు ప్రారంభించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న అటవీ భూమిలో 142 ఎకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబరు లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్‌లు, వాక్‌వేలు, ధ్యానమందిరాలతో పాటు సందర్శకుల రద్దీ నియంత్రణకు ఐదు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యాధునిక హంగులతో సరికొత్త ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ ముమ్మర కార్యాచరణ ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును తలపించేలా.. అన్ని రకాల అధునాతన సౌకర్యాలతో ఈ పార్కును రూపొందించనున్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదిత నివేదికను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ఎకో పార్కు పనులను ఈ ఏడాది డిసెంబరులోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం 424 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. అందులో 142 ఎకరాలను ప్రత్యేకంగా ఎకో పార్కు అభివృద్ధి కోసం కేటాయించారు. ఈ పార్కులో సందర్శకుల కోసం సైక్లింగ్ ట్రాక్‌లు, ఆహ్లాదకరమైన వాక్‌వేలు, ప్రశాంత వాతావరణంలో యోగా చేసుకునేందుకు ధ్యానమందిరాలను నిర్మించనున్నారు. అలాగే వివిధ అధికారిక, అనధికారిక సమావేశాల నిర్వహణకు వేదికలు, సందర్శకులు కూర్చుని మాట్లాడుకునేందుకు వీలుగా పచ్చిక బయళ్లలో ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు సుమారు 30 వేల మంది సందర్శకులు వచ్చినా తట్టుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ఒకేసారి వస్తే ప్రవేశ ద్వారాల వద్ద రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా పార్కుకు ఐదు వేర్వేరు చోట్ల ప్రధాన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నారు. వారాంతాల్లో కుటుంబాలతో గడిపేవారి కోసం ప్రత్యేక యాక్టివిటీ జోన్లు, పిల్లల వినోదం కోసం ప్లేజోన్లను కూడా సిద్ధం చేస్తున్నారు. గతంలో గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ భూములంటూ ఆక్రమించుకుని కోర్టులను ఆశ్రయించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి కస్నా నాయక్‌లు లీగల్ టీమ్‌తో కలిసి పక్కా ఆధారాలు సేకరించారు. ప్రైవేటు వ్యక్తులు కోర్టులో సమర్పించిన ధ్రువపత్రాలు నకిలీవని నిరూపించడంలో వారు విజయం సాధించారు. దీంతో ఆ భూములు పూర్తిగా అటవీశాఖవేనని స్పష్టం చేస్తూ గతేడాది సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పు అనంతరం అటవీశాఖ ఆక్రమణలను తొలగించి రికార్డులను సరిచేసింది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోంచి దక్కించుకున్న 116 ఎకరాల భూమిని స్పష్టంగా గుర్తిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్రమణల నుంచి విముక్తి పొందిన ఈ అటవీ భూమి ఇప్పుడు నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని, ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన హరితవనంగా మారబోతోంది.

చురకలు


# హర్మూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రాంతీయ శాంతి, హర్మూజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛ వంటి కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ఇరాన్ అధ్యక్షుడు ప్రధానికి వివరించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. అలాగే భవిష్యత్ కార్యాచరణపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపింది. ఫోన్ సంభాషణలో ప్రధాని మోదీ, చర్చల ద్వారా సాధించిన పురోగతిని స్వాగతించారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. ప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం నెలకొనేలా అన్ని వర్గాలు కృషి కొనసాగించాలని సూచించారు. అంతేకాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్య రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భారత్‌కు ఇంధన అవసరాల్లో గల్ఫ్ దేశాల ప్రాధాన్యం దృష్ట్యా హర్మూజ్ జలసంధి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. ప్రపంచంలో సముద్ర మార్గంలో తరలించే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడటంతో పాటు భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు పీఎంఓ పేర్కొంది.

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ కూడా పశ్చిమాసియాలోని తాజా పరిణామాలను ప్రధానికి వివరించారు. ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, శాంతి ప్రయత్నాలు, తదుపరి చర్యల గురించి ఆయన వివరణ ఇచ్చినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్?లో స్పందించారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. చర్చల్లో సాధించిన పురోగతిని స్వాగతించానని, కొనసాగుతున్న ప్రయత్నాలు ప్రాంతంలో శాశ్వత శాంతికి దారి తీస్తాయని ఆశాభావం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే హర్మూజ్?లో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌కే కాకుండా ప్రపంచానికే అత్యంత ముఖ్యమని మరోసారి పునరుద్ఘాటించినట్లు వెల్లడించారు.




### 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం

ఇటీవలి కాలంలో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ మధ్య జరిగిన వరుస చర్చల్లో ఇది మరో ముఖ్యమైన సంభాషణగా భావిస్తున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, సముద్ర వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై భారత్ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజుల క్రితం అమెరికా-ఇరాన్ మధ్య 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరినట్లు సమాచారం వెలువడింది. ఇందులో హోర్ముజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరవడం, ఇరాన్‌పై అమలులో ఉన్న కొన్ని ఆర్థిక పరిమితులను సడలించడం వంటి అంశాలు ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడి మధ్య తాజా చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అయితే అమెరికాతో సమీప భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ స్థాయి సమావేశాలు నిర్వహించే ప్రణాళిక ప్రస్తుతం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి మీడియాతో మాట్లాడుతూ, అమెరికా ప్రతినిధులతో రాబోయే రోజుల్లో ఏ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించే యోచన లేదన్నారు. దోహాలో జరగబోయే సమావేశాలు అమెరికాతో రాజకీయ చర్చలు కాదని, ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందంలోని అంశాల అమలుకు సంబంధించిన సాంకేతిక స్థాయి చర్చలేనని వివరించారు. ప్రత్యేకంగా ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన ఆర్థిక ఆస్తుల విడుదల, ఒప్పందంలోని ఇతర నిబంధనల అమలుపై ఖతార్ ప్రతినిధులతో చర్చలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. మరోవైపు, పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు భారత్ ఎప్పటినుంచో సమతుల్య వైఖరినే అవలంబిస్తోంది. వివాదాలను యుద్ధం ద్వారా కాకుండా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అదే సమయంలో భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకేతాన్ని కూడా ఇస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో జరిపిన తాజా టెలిఫోన్ సంభాషణ పశ్చిమాసియా పరిణామాలపై భారత వైఖరిని మరోసారి స్పష్టంగా తెలియజేసింది.

# ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యంగా

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, ఆయా శాఖల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సేవా తీర్థ్‌లో కీలక సమావేశం నిర్వహించారు. దేశంలో పరిపాలనా సంస్కరణల్ని వేగవంతం చేయడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపర్చడం, ప్రజలకు ప్రభుత్వ సేవల్ని సులభతరం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అలాగే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్లడం, వేగంగా అమలు చేయడం కూడా ఈ 4 గంటల ఉన్నత స్థాయి సమావేశంలో చర్చకు వచ్చింది. సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మొదటిది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం డీ- రెగ్యులేషన్ (అనవసర నిబంధనల సరళీకరణ), ఇతర పరిపాలనా సంస్కరణలు' అంటే అంటే వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం సహా పౌరుల రోజువారీ జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చడం. ఇక రెండోది 'ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేయడం'. వివిధ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించడం. ఈ సందర్భంగా వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు తమ శాఖలు చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రధానికి వివరించారు. ప్రధాని విజన్‌ను కార్యచరణగా మార్చేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి రూపొందించిన భవిష్యత్తు వ్యూహాల్ని కూడా వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ- ప్రభుత్వ శాఖలు విడివిడిగా కాకుండా పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మొత్తం ప్రభుత్వ



యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు ప్రధాని.

### ప్రభుత్వ పథకాల అమలు- ప్రజల జీవితాల్లో మార్పుపై దిశానిర్దేశం

వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, డేటా ఆధారిత నిర్ణయాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం గతిశక్తి ప్లాట్‌ఫారంను మరింత విస్తృతంగా వినియోగించాలని ప్రధాని సూచించారు. ఈ వేదిక ద్వారా మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత సులభతరమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల విజయాన్ని కేవలం అవి అమలవుతున్నాయా లేదా అన్నదానితో కాకుండా వాటి వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందనే దానితోనే అంచనా వేయాలని ప్రధాని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ తదితరులు పాల్గొన్నారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మొట్టమొదటి పూర్తి స్థాయి కార్యదర్శుల స్థాయి సమావేశంగా తెలుస్తోంది. 2026 రెండో అర్థభాగానికి సంబంధించి ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం కూడా సమావేశం ఉద్దేశంగా తెలుస్తోంది.

### మోదీ విజన్ లక్ష్యాలకు అనుగుణంగా- దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి

ఇక తాజా సమావేశంలో జరిగిన చర్చలు జూన్ 21న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించిన సంస్కరణల కార్యచరణకు కొనసాగింపుగా నిలిచాయి. అప్పుడు కూడా ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపర్చడంతో పాటుగా యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి (2047, ఆగస్ట్ 15) అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టాలన్న మోదీ దార్శనికతలో భాగంగా ప్రభుత్వం దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి సారిస్తున్న తరుణంలో ఈ మీటింగ్ జరిగింది. మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు మార్కెట్లలో అస్థిరత వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరును కనబరుస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇక డాలర్‌తో పనిలేదు...
## భారత్-జపాన్ కీలక ఒప్పందం!

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు (అశీఅ-తీవంఱuవత్ం) భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×), జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్-జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

## గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఉద్దేశించిన వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం-వీబీజీ రామ్‌జీ యాక్ట్- 2025 ఈ జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రాబోతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్నటువంటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలోనే ఈ కొత్త వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకారం కొత్త చట్టం కింద అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 100 రోజులకు బదులుగా 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధ హామీ లభిస్తుంది. ఈ పథకం అమలుకు అవసరమైన పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక ఏర్పాట్లు పూర్తయ్యాయని కేంద్రం తెలిపింది. అయితే ఈ పథకం మార్పుపై కాంగ్రెస్ పార్టీతో సహా గ్రామీణ ఉపాధి హక్కుల కార్యకర్తలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం అమలు కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 95,692.31 కోట్ల మేర తాత్కాలిక నిధులు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కొత్త వ్యవస్థలో అంతా సజావుగా జరిగి, కార్మికులకు వేతనాలు కూడా ఆలస్యం కాకుండా అందుతాయని పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ- 'పనిచేయాలనుకునే ఒక్క అర్హుడైన గ్రామీణ కార్మికుడు కూడా ఉపాధి లేకుండా ఉండకూడదనేదే ప్రభుత్వ లక్ష్యం' అని చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి ఈ చట్టం అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

### గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర

ప్రస్తుతం ఈ- కేవైసీ ధ్రువీకరణ పొందిన జాబ్ కార్డులు, కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు చెల్లుబాటులోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే గ్రామ పంచాయతీలే పథకం అమలులో ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపింది. నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతులు, మహిళా సాధికారత వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటికే బడ్జెట్ కేటాయించగా, 24 రాష్ట్రాలు తమ రాష్ట్ర స్థాయి ఎదీ- + =ూవీ + పథకాల నోటిఫికేషన్లు జారీ చేశాయి.

### రాష్ట్రాలపైనే భారం మోపుతున్న కేంద్రం: కాంగ్రెస్ విమర్శలు

కొత్త వీబీ జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శలు చేసింది. కొత్త పథకాన్ని తీసుకొచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. లోక్‌సభలో ఇచ్చిన సమాచారం ప్రకారం 2026 మార్చి నాటికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 17144.13 కోట్ల ఎంజీనరేగా బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీంట్లో రూ. 7846.25 కోట్లు కార్మికుల వేతన బకాయిలే ఉన్నాయని తెలిపారు. కర్ణాటక, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు కోట్లల్లో బకాయిలు విడుదల కాలేదని ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో వీ+చీ=జు+ూ లో కార్మికుల వేతన వ్యయాల్ని కేంద్రమే పూర్తిగా భరించేదని, ఇప్పుడు కొత్త పథకంలో మొత్తం వ్యయంలో 40 శాతం భారాన్ని రాష్ట్రాలపైనే మోపుతున్నారని విమర్శలు గుప్పించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల బ్లాక్ అవుట్ నిబంధన వల్ల గ్రామీణ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, దీనిని పునఃసమీక్షించాలని పలు రాష్ట్రాలు కోరుతున్నట్లు ఖర్గే తెలిపారు. ఇంకా రోజువారీ కూలీని రూ. 400 కు పెంచాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండిస్తోంది. వీబీ జీ రామ్ జీ యాక్ట్ గ్రామీణ జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తుందని, ఉపాధి అవకాశాల్ని పెంచడంతో పాటుగా గ్రామీణ ఆస్తుల సృష్టికి దోహదపడుతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త చట్టం జాతీయ స్థాయిలో ప్రారంభ కార్యక్రమం జులై 2న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లి గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డుల పంపిణీతో పాటుగా పథకంపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

# రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం

బలమైన ఆర్థిక వ్యవస్థ, అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం, పటిష్ఠమైన జాతీయ భద్రత ఈ మూడూ ఒక గొప్ప దేశానికి మూలస్తంభాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక గత రెండు దశాబ్దాల్లో గుజరాత్ అభివృద్ధికే కాకుండా దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను కూడా తాను సందర్శిం చినట్లు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), గిరిజన ఉత్పత్తులు, భారీ పరి శ్రమలు, రక్షణ రంగానికి సంబంధించిన అనేక విభాగాలు ఇందులో పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయమని చెప్పారు. దేశంలో ప్రైవేటు పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

### మోదీ కూడా ఈ నేల నుంచే!

గుజరాత్ దేశానికి ఎన్నో గొప్ప నాయకులను అందించిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి మహానుభావులతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ నేల నుంచే ఎదిగారని చెప్పారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ మరింత పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ వేదికల్లో భారత్ మాట్లాడితే ప్రపంచ దేశాలు ఆసక్తిగా వినే పరిస్థితి ఏర్పడిందని, దీనికి నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. వైబ్రంట్ గుజరాత్ కార్యక్రమం 2003లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ప్రారంభించారని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. అప్పట్లో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రారంభమైన ఈ వేదిక, ఇప్పుడు దేశ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. గత 20 ఏళ్లలో గుజరాత్‌లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం దేశ ఆర్థికాభివృద్ధికి గుజరాత్ గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. తాను రక్షణ మంత్రిగా వైబ్రంట్ గుజరాత్ సదస్సుకు రావడంపై కొందరికి సందేహాలు రావొచ్చని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే ఆర్థికాభివృద్ధి, జాతీయ భద్రత రెండూ విడదీయరాని అంశాలని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఉంటేనే దేశ భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని తెలిపారు. అలాగే రక్షణ రంగం అభివృద్ధి అంటే కేవలం ఆయుధాల తయారీ మాత్రమే కాదని, దాని ద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు,



సాంకేతిక రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వీటి ద్వారా తయారీ రంగం విస్తరించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్న నేపథ్యంలో భారత పరిశ్రమలు కూడా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

### ఒకదానితో ఒకటి అనుసంధానమై!

గొప్ప దేశాలు మూడు ప్రధాన ఆధారాలపై నిలబడతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మొదటిది బలమైన ఆర్థిక వ్యవస్థ, రెండోది సాంకేతిక సామర్థ్యం, మూడోది జాతీయ భద్రత అని వివరించారు. ఈ మూడు పరస్పరం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయని చెప్పారు. ఆర్థికంగా బలమైన దేశం సాంకేతికంగా కూడా ముందంజలో ఉంటుందని, అలాంటి దేశంలో భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో జాతీయ భద్రత బలంగా ఉన్నప్పుడు పరిశ్రమలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు వేగంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై భారత్ పోషించే పాత్ర దేశ స్వావలంబన, సాంకేతిక సామర్థ్యం, ప్రజల సమష్టి సంకల్పంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం అన్ని రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని, పరిశ్రమలు, స్టార్టప్‌లు, రక్షణ తయారీ, సాంకేతిక రంగాలు కలిసి పనిచేస్తే భారత్ ప్రపంచంలో మరింత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక కేవలం పెట్టుబడుల సదస్సుగా మాత్రమే కాకుండా దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికగా మారిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, యువ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్ణీత సమయంలోనే సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

చురకలు






# పౌరసత్వం


## అసలు గుర్తింపు ఏది?

### పాస్‌పోర్టు.. ఆధార్ కాదు.. మరి భారతీయుడినని నిరూపించేది ఏమిటి?

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తిపైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# ఇథనాల్ కేటాయింపుల వివాదం

- కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు 'స్టేటస్ కో'!
- కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్
- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించకుండా నేరుగా ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ పిటిషనర్లను ప్రశ్నించిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తున్న 2025-26 సరఫరా సంవత్సరపు ఇథనాల్ కేటాయింపుల వివాదంలో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుందని న్యూఢిల్లీ బ్యూరో ప్రత్యేక కథనంలో వెల్లడించింది. ఇథనాల్ సరఫరాకు సంబంధించి గతంలో కర్ణాటక హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా బీపీసీఎల్ తరపున కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి హాజరై బలమైన వాదనలను వినిపించారు. పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన రంగ స్వావలంబనలో భాగంగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న (ఇథనాల్ బ్లెండింగ్) బృహత్తర లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని ఆయన న్యాయస్థానానికి స్పష్టం చేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపే ఈ అద్భుతమైన ప్రక్రియ యొక్క పూర్తి స్థాయి సానుకూల ఫలితాలు వచ్చే ఏడాది నాటికే దేశంలో స్పష్టంగా కనిపిస్తాయని ఆయన ధర్మాసనానికి వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం వినిపించిన ఈ వాదనలపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, ఈ వివాదంలో పిటిషనర్లు మొదటగా కర్ణాటక హైకోర్టుకు చెందిన డివిజన్ బెంచ్‌ను ఎందుకు సంప్రదించలేదని, నేరుగా సుప్రీంకోర్టుకు ఎందుకు రావాల్సి వచ్చిందని ప్రశ్నించింది. దీనికి అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సమాధానమిస్తూ, గడిచిన అక్టోబర్ 2025 నాటికే ఇథనాల్ సరఫరాకు సంబంధించిన అన్ని అధికారిక ఒప్పందాలు పూర్తిగా ముగిసిపోయాయని సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఇటువంటి తరుణంలో ఇప్పుడు మళ్లీ ఈ కేటాయింపుల ప్రక్రియను మొదటికి తీసుకువస్తే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమానికి తీవ్రమైన ఆటంకాలు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇలాంటి ఇథనాల్ కేటాయింపుల వివాదాలు పలు రాష్ట్రాల హైకోర్టులలో విచారణ దశలో నడుస్తున్నాయని, దీనివల్ల వేర్వేరు కోర్టులు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇచ్చే అవకాశం ఉందని అటార్నీ జనరల్ కోర్టుకు వివరించారు. భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన చిక్కులను నివారించేందుకు వీలుగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న ఈ కేసులన్నింటినీ ఒకే చోటికి బదిలీ చేయాలని ఆయన సుప్రీంకోర్టును అభ్యర్థించారు. కేంద్ర అటార్నీ జనరల్ చేసిన ఈ బదిలీ విజ్ఞప్తిని ప్రైవేట్ కంపెనీల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్ తీవ్రంగా వ్యతిరేకించారు. కేసు విచారణను సాధ్యమైనంత వరకు ఆలస్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి బదిలీ పిటిషన్ల వ్యూహాన్ని తెరపైకి తెచ్చిందని ఆయన న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. ఈ విధంగా ఇరు పక్షాల నుంచి వ్యక్తమైన సుదీర్ఘ వాదోపవాదాలను నిశితంగా పరిశీలించిన సుప్రీంకోర్టు, ఈ కేసులో ప్రస్తుతానికి యథాతథ స్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలంటూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వివాదంపై కోర్టులో తదుపరి విచారణ జరిగేంత వరకు ఈ స్టేటస్ కో ఆదేశాలు దేశవ్యాప్తంగా అమల్లో ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ప్రధాని మోదీకి ఫోన్ చెయ్

### అమెరికా రాయబారి సర్జియో గోర్‌తో డొనాల్డ్ ట్రంప్..

**ఢిల్లీ, జూన్ 30:** భారత ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్నేహితుడు అంటూ ప్రపంచ వేదికలపై ఇప్పటికే పలుమార్లు చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా వారి మధ్య ఉన్న స్నేహబంధాన్ని తెలియజేసే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మయామీలో ఈ ఏడాది ఏప్రిల్ 11న యూఎఫ్‌సీ 327 ఈవెంట్ జరిగింది. ఈ సందర్భంగా భారత ప్రధాని మోదీకి ఫోన్ చేయాలని డొనాల్డ్ ట్రంప్ అనుకున్నారట. ఈ విషయాన్ని భారత్‌లోని అమెరికా రాయబారి సర్జియో గోర్ తెలిపారు. ఈ అంశాన్ని అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య లీడర్‌షిప్ సమ్మిట్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) వేదికగా గోర్ వెల్లడించారు. 'యూఎఫ్‌సీ 327 ఈవెంట్ వేదిక వెనుక ఉన్నప్పుడు మోదీకి ఫోన్ చేద్దామని ట్రంప్ నాతో అన్నారు. ఆ సమయంలో భారత్‌లో ఉదయం 6 గంటలని, ఇది తగిన సమయం కాదని సూచించా. అయినా ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. మోదీ మేల్కొనే ఉంటారు, ఆయన కూడా నాలాగే తక్కువగా నిద్రపోతారని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేదికపైకి వెళ్లాల్సి రావడంతో ఆ కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు' అని గోర్ తెలిపారు. ఈ ఘటన అమెరికా-భారత్ సంబంధాల్లో ఉన్న సాన్నిహిత్యాన్ని తెలియజేస్తోందని సర్జియో గోర్ చెప్పుకొచ్చారు. స్నేహం ఉన్నప్పుడు ప్రతి విషయాన్ని షెడ్యూల్ చేయాల్సిన అవసరం ఉండదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ట్రంప్‌నకు భారత్‌పై ప్రత్యేక అభిమానం ఉందని, మోదీతో ఆయన సంబంధం ఇతర ప్రపంచ నేతలతో పోలిస్తే భిన్నంగా ఉంటుందన్నారు. కొంతమంది నేతలతో తాము ఫార్మల్‌గా మాత్రమే వ్యవహరిస్తామని, కానీ ప్రధాని మోదీ విషయంలో అలా ఉండదని పేర్కొన్నారు. అలాగే భారత్ పర్యటన జ్ఞాపకాలను ట్రంప్ తరచూ గుర్తు చేసుకుంటారని గోర్ తెలిపారు. ఇక అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం చివరి దశలో ఉందని, కేవలం ఒక శాతం చర్చలు మాత్రమే మిగిలి ఉన్నాయని వెల్లడించారు. కాగా, గోర్ వ్యాఖ్యలు ట్రంప్-మోదీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని మరోసారి చర్చనీయాంశం చేశాయి.



# ఆశారాం బాపుకు దక్కని ఊరట

- బెయిల్ మంజూరుకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, జూన్ 30:** 2013లో ఓ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు బాబా ఆశారం బాపునకు సుప్రీంకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించలేదు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. తనపై విధించిన జీవిత ఖైదును సమర్థిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆశారాం బాపు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆశారాం పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు ఆశారాంకు ఎలాంటి బెయిల్ మంజూరు చేయ-ంబోమని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఆశారాం తరఫు న్యాయవాదులు వైద్య కారణాలను ప్రస్తావిస్తూ బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అయితే ప్రస్తుతం అలాంటి తక్షణ ఉపశమనానికి అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. ప్రాణాలకు ముప్పు కలిగించేంత తీవ్రమైన అత్యవసర పరిస్థితి ఉన్న సందర్భాల్లో మాత్రమే బెయిల్ అంశాన్ని పరిశీలించగలమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, 2013లో రాజస్థాన్‌లో ఓ మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో ఆశారాం బాపు దోషిగా తేలారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆశారాం జోధ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆయన న్యాయపరమైన పోరాటం కొనసాగుతున్నప్పటికీ, తక్షణ ఉపశమనం మాత్రం లభించలేదు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే అఫిడవిట్, తదుపరి విచారణలో కోర్టు అభిప్రాయం కీలకంగా మారనున్నాయి.

# భారత ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

### పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.



# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్, జూన్ 30:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్‌లోని కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన రూ.2 లక్షల విలువైన 7 చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో గొప్ప భరోసాగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ చెక్కులను మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కృషితో ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, కొర్ర శంకర్ నాయక్, భరత్ కుమార్, సాయి యాదవ్, వార్డ్ అధ్యక్షుడు బి. నవీన్, నాయకులు ఉస్మాన్, శ్రీశైలం యాదవ్, కిషన్, ప్రభాకర్, రాజిరెడ్డి, స్థానిక నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ 14వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమం

గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్



**గజ్వేల్ టౌన్, జూన్ 30:**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 14వ వార్డ్, బూత్ నం.140,136,137 లలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం గుమటం దగ్గర నిర్వహించడం జరిగింది. ఈ ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, డూప్లికేట్ ఓట్లును , మరణించిన వారి ఓట్లను తొలగింపు, చిరునామా మార్పులు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడం, అనర్హులను తొలగించడం అలాగే ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ప్రక్రియను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, బీఎల్ఏ, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం



**మద్దూరు, జూన్ 30:**
మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరముకు గాను ఓపెన్ స్కూల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనాయని పాఠశాల ఏఐ కోఆర్డినేటర్ జి వరదరాజు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి చంద్రభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ తీసుకోవడానికి అర్హులని తెలిపారు. అదే విధంగా ఉద్యోగాలలో ప్రమోషన్ తీసుకోవడానికి, బడి మధ్యలో ఆపేసిన వారికి, గృహిణులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందువలన తప్పకుండా మా యొక్క పాఠశాలలో పదవ తరగతిలో, ఇంటర్మీడియట్లో ఈ విద్యా సంవత్సరంకు గాను అడ్మిషన్లుకు చివరి తేదీ 28 జూలై 2026 వరకు అడ్మిషన్లు తీసుకోబడునని, కాబట్టి ఇట్టి అవకాశాన్ని అందరు ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. పూర్తి వివరాలు ఈ క్రింది నెంబర్లను 9948250886, 7893597519 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# తొగుట ఏఎంసిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- ఏఎంసి చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి
- సమీక్షా సమావేశం నిర్వహించిన ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి



**తొగుట, జూన్ 30:**
తొగుట వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆధ్వర్యంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని విక్రయించేలా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని వారిని అభినందించారు. తొగుట మండల వ్యాప్తంగా ఐకేపీ ద్వారా వడ్లు 2,829 మంది రైతుల ద్వారా 1,16,537.60 క్వింటాళ్ల ధాన్యం,పాక్స్ కాన్గల్ ద్వారా 1,279 రైతుల నుండి 55,149.60 క్వింటాళ్ల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. అదే విధంగా పాక్స్ కాన్గల్ ద్వారా 746 రైతుల నుండి 9521.50 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు, 730 మంది రైతుల ద్వారా 29,686 క్వింటాళ్ల మొక్కజొన్న పంటను సేకరించడం జరిగిందన్నారు. కొనుగోలు అనంతరం రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం కొనుగో ళ్లలో సహకరించిన జిల్లా యంత్రాంగంకి కృతజ్ఞతలు తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్లలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక తహశీల్దార్ సమీర్ హైమద్ ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణ రెడ్డి ప్రత్యేక చొరవతో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోలు పూర్తి చేశామని అన్నారు. పూర్తి స్థాయిలో పనిచేసిన కో అపరేటివ్ సీఈఓ గంగారెడ్డి, స్థానిక సర్పంచ్ లు, కో ఆపరేటివ్ సిబ్బంది స్వామి, శేఖర్, అధికారులు, మార్కెట్ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, మహిళ సమాఖ్య సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఏపీఎం బాబురావు, సీసీలు రజినీ, భాస్కర్, దాస్, హమాలీ కార్మికులు కనకయ్య, గణేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్..

**కుత్బుల్లాపూర్ , జూన్ 30:**
ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పిలుపునిచ్చారు. మంగళవారం మగ్దుమ్ నగర్‌లోని ఆయన నివాస కార్యాలయం వద్ద జీఎల్ఆర్ఏ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యుల బృందం సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలుకుల జగన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన జీఎల్ఆర్ఏ ఇండియా స్వచ్ఛంద సంస్థ సభ్యులకు, మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికంగా నిరుపేదలు నివసించే బస్తీల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం వల్ల ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. వైద్యుల బృందం మాట్లాడుతూ, రోగులకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు వైరల్ ఫీవర్, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి తదితర సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యులు డా. సంజయ్ కుమార్, డా. సౌజన్య, స్నేహ, శివాని పాల్గొన్నారు. అలాగే మాజీ అధ్యక్షుడు రుద్రా అశోక్, మల్లేష్ గౌడ్, కొలుకుల జైహింద్, వేణు యాదవ్, పాపిరెడ్డి, సీహెచ్ దాసు, ప్రభాకర్, హనుమంతు, విట్టల్ గౌడ్, రాయి రాజేష్, సునీల్ రెడ్డి, సంపత్ రెడ్డి, జై మల్లేష్, సబిత, ఉమారాణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# బియ్యం తూకం వేసి ఇస్తేనే తీసుకుంటాం

రేషన్ డీలర్ల ధర్నా



**తూప్రాన్, జూన్ 30:**
బియ్యం గోడౌన్ వద్ద నుండి డీలర్లకు బియ్యాన్ని తూకం వేసి ఇవ్వాలని కోరుతూ తూప్రాన్, మనోహరాబాద్, శివంపేట మండలాల డీలర్లు మంగళవారం డీలర్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తూకం వేయకుండా బియ్యం సరఫరా చేయడంతో తాము ఒక్కో డీలర్ క్వింటాల్ నుండి మూడు క్వింటాల బియ్యం వరకు తక్కువ వస్తున్నాయని, తాము అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బియ్యం గోడౌన్ వద్ద నుండి ఇవ్వాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పాయింట్ ఇంచార్జి అమ్మాయిలు సహకరించడం లేదంటూ వాపోయారు. బియ్యాన్ని లారీ నుండి వేరే లారీలోకి మార్చి ఇవ్వడంతో ఒక్కో బస్తాకు కిలో నుండి ఐదు కిలోల వరకు తక్కువ వస్తున్నాయని అన్నారు. గతంలో ఈపాస్ మెషిన్లు లేకపోవడంతో ఎలాగో అలాగు సర్దుబాటు చేశామని రాష్ట్ర ప్రభుత్వం ఈపాస్ మెషిన్లు ప్రవేశ పెట్టడంతో తమకు ఒక గింజ మిలడం లేదని అన్నారు. గోడౌన్ నుంచి వచ్చే బియ్యం తక్కువ రావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గోడౌన్ పాయింట్ నుండి తూకం వేసి ఇచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై బియ్యం గోడౌన్ ఇంచార్జి అహ్మద్ ఖాన్ ఇటీవలనే ఇన్చార్జి బాధ్యతలు తీసుకున్నానని డీలర్లకు తూకం వేసి ఇవ్వడానికి అభ్యంతరం లేదని వీలైతే వచ్చి తూకం వేసిన తర్వాత తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్, మనోహరాబాద్, శివంపేట డీలర్లు శ్రీనివాస్ పాపయ్య చారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# భట్రాజు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సాయి కృష్ణ నియామకం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 30:**
భట్రాజు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సిద్దిపేట జిల్లా వాస్తవ్యులు ఎర్రమరాజు సాయి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా భట్రాజు సంఘం బలోపేతం కోసం పలు జిల్లాల్లో సంస్థాగత మార్పులు, నూతన బాధ్యతల కేటాయింపు కొనసాగుతోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయి కృష్ణ మాట్లాడుతూ, 2001లో మెదక్ జిల్లా



భట్రాజు సంఘం పునర్నిర్మాణంలో తన తండ్రి దివంగత ఎర్రమరాజు వెంకట నరసింహరాజు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అప్పటి నుంచి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సంఘ సేవలో భాగస్వామిగా కొనసాగుతున్నానని తెలిపారు. సిద్దిపేట జిల్లా భట్రాజు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తాను చేపట్టిన సేవా కార్యక్రమాలను రాష్ట్ర నాయకత్వం గుర్తించి తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం కార్యదర్శి బాధ్యతలను అప్పగించడం తనకు ఎంతో గౌరవంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ నియామకం తనలో మరింత ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. భట్రాజు సంఘం అభ్యున్నతికి, కులస్తుల సంక్షేమం, యువత ప్రోత్సాహం మరియు సంఘ ఐక్యత కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని సాయి కృష్ణ స్పష్టం చేశారు. తన సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా నాయకులకు, సంఘ సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులో సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# హిందూ దేవి దేవుళ్ళ పై అవహేళన చేస్తే ఊరుకోము

గజ్వేల్ భజరంగ్ దల్ శాఖ

**గజ్వేల్ టౌన్, జూన్ 30:**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న సెంట్ మేరీ స్కూల్ లో విఘ్నేశ్వరుని ఫోటో పోస్టర్ ఏర్పాటు చేశారు. ఆ పోస్టర్ పైన విఘ్నేశ్వరుడిని అవహేళన చేసే విధంగా రాతలు రాయడంతో మంగళవారం గజ్వేల్ భజరంగ్ దల్ కార్యకర్తలు ఆ స్కూల్ ప్రాంగణానికి చేరుకొని వారితో మాట్లాడి ఆ పోస్టర్ ని తొలగించారు. ఈ సందర్భంగా భజరంగ్ దల్ జిల్లా బలోపాసన ప్రముఖ్ ఎర్రవాడ అరవింద్ మాట్లాడుతూ హిందూ ధర్మం, దేవి దేవుళ్ళ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన, అవహేళన చేసిన ఊరుకోమని, ప్రజ్ఞాపూర్ సమీపంలో జగదేవ్ పూర్ రోడ్లో ఉన్న సెంట్ మేరీ స్కూల్ లో విఘ్నేశ్వరుడి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టర్ ఏర్పాటు చేశారని తెలియడంతో అక్కడికి వెళ్లి ఆ పోస్టర్ తొలగించడం జరిగిందన్నారు. అంతేకాకుండా గతంలో కూడా సెంట్ మేరీ స్కూల్లో పిల్లలకు గాజులు తీయించడం, చేతికి ఉన్న రాఖీలు, కంకణాలు తీయిస్తే వెళ్లి మాట్లాడామని, ఇక మీదట హిందూ సాంప్రదాయం, దేవి దేవుళ్ళ పై అవహేళన చేస్తే చూస్తూ ఊరుకోమని, భజరంగ్ దల్ ఆధ్వర్యంలో స్కూల్ పూర్తిగా బంద్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ నగర సంయోజక్ లఖన్, నగర గోరక్ష ప్రముఖ్ ఊడుగుల శ్రీకాంత్, ప్రఖండ సురక్ష ప్రముఖ్ నితిన్, నగర సహ సురక్ష ప్రముఖ్ కాళ్ళ సంపత్ , బజరంగ్ దళ్ కార్యకర్తలు జమలపూర్ నాగరాజు ,సాయి,రాజేష్, రాకేష్,కన్ని, గణేష్, మహేష్ శ్రీధర్,చందు, శ్రీకాంత్, కార్తీక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- నేరాల నియంత్రణ, ప్రజాభద్రతతో పాటు మెరుగైన సేవలు అందించాలి
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్
- గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ

**గజ్వేల్ ప్రతినిధి, జూన్ 30:**
పోలీస్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నేరాల నియంత్రణ ప్రజా భద్రతతో పాటు వారికి మెరుగైన సేవలను అందించాలని సిద్ధిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయంలోని సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యాలయ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మెరుగు పడుతుందని పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో నమోదవుతున్న తీవ్ర నేరాల కేసులను సమీక్షించిన సీపీ, ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ప్రామాణిక విధానాలు అనుసరిస్తూ కేసుల విచారణలో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ సందర్శిస్తూ



సిబ్బంది పనితీరును పర్యవే క్షించాలని అధికారులకు సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని చెప్పారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, సామాజిక భద్రత అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత పెంచాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలు, వాహనాల పార్కింగ్ షెడ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఆరోగ్యం, రఘుపతి, కృష్ణారెడ్డి, యూనుస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన కూన శ్రీనివాస్ గౌడ్

**కుత్బుల్లాపూర్, జూన్ 30:**
గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహాదేవపురం డివిజన్ (దేవేందర్ నగర్)లో మంగళవారం అక్షర జ్యోతి మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే పలు సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కూడా మహిళల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర జ్యోతి మహిళా సమైక్య అధ్యక్షురాలు ఎన్. పూలమ్మ, జ్యోతి, రామలక్ష్మి, స్థానిక కాంగ్రెస్ నాయకులు యం. సాగర్, దంపనబోయిన



శ్రీనివాస్, శివప్ప, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, డాన్ శీను, ఋషి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్, సాగర్ తదితరులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ గ్రౌండ్ పునరుద్ధరణకు హామీ

- కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 30:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు కేటాయించిన గ్రౌండ్‌లో అనధికారికంగా షెడ్లు నిర్మించి షాపులు నిర్వహిస్తున్న విషయాన్ని స్థానికులు మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి



అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ వంటి సాంప్రదాయ పండుగలు నిర్వహించేందుకు కేటాయించిన స్థలాలను ప్రజల వినియోగానికి అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. గ్రౌండ్‌పై ఉన్న ఆక్రమణలను తొలగించి, మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మ ఆడుకునేలా షెడ్ ఏర్పాటు చేయించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. అదేవిధంగా కాలనీలోని ఇతర సమస్యలపైనా స్పందిస్తూ, విద్యుత్ దీపాలు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య పనులు, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి మౌలిక వసతుల కల్పనకు అధికారులతో చర్చించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ వాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 30:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 295వ డివిజన్ బౌరంపేట్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్ – సర్ ) ను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బూత్ లెవెల్ అధికారులతో ( బిఎల్ఓ లు) కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు బీఎల్ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్న కొలన్ హన్మంత్ రెడ్డి, ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో



భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ లు), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐ.టి.డి.ఎ భద్రాచలం ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణ ఏర్పాట్లను పరిశీలించిన

### ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, జూన్ 30:**
అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నేడు నియోజకవర్గ కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా రైతు వేదికను సందర్శించిన త్వరలో ఐటీడీఏ భద్రాచలం వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత ఉపాధి ఉద్యోగ శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. యువతకు నాణ్యమైన శిక్షణ అందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో ఉపాధ్యాయులతో మాట్లాడారు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కళాశాల మరియు హాస్టల్‌లో ఉన్న సమస్యలు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు ప్రజా సంక్షేమం విద్యాభివృద్ధి యువత ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 30:**
సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంగా సేవలందించిన నలుగురు పోలీసు అధికారులు మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో వారికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవీ విరమణ పొందిన అధికారులు.. వై వెంకటేశ్వరరావు–ఆఫీస్ సూపరింటెండెంట్, ఎడ్ల రాంమూర్తి–అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మామిడిపల్లి పెంటయ్య–హెడ్ కానిస్టేబుల్, వరికోటి నవీన్ కుమార్–అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లు ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ పదవీ విరమణ పొందిన అధికారులను అభినందించి, సన్మాన పత్రాలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన అధికారులకు కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట పోలీస్ విభాగానికి వారు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీస్ కుటుంబ సభ్యులుగానే కొనసాగుతారని, భవిష్యత్తులో ఎలాంటి అవసరం లేదా



సమస్య వచ్చినా పోలీస్ శాఖ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కమిషనర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణ కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులదే

### మంత్రి తుమ్మల



**దమ్మపేట, జూన్ 30:**
తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు దమ్మపేట మండలం, గండుగులపల్లి తన నివాస గృహంలో మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. చెరువుల్లో నీళ్లు నిండితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా మండల కేంద్రాల్లోని చెరువులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

## సీఎం రైతు భరోసా నిధుల విడుదల లైవ్ స్ట్రీమ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, జూన్ 30:**
తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి రైతు భరోసా నిధుల విడుదల, శిల్పకళా వేదికలో రైతులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమం ను దమ్మపేట మండల వ్యవసాయ శాఖ పట్వారిగూడెం రైతు వేదిక నందు లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేసిన సందర్భంగా పాల్గొన్న అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం లో మొత్తం 48,838 మంది రైతులకు గాను రైతు భరోసా ద్వారా 92 కోట్ల 77 లక్షల 50 వేల 912 రూపాయలను రైతులకు చెందిన బ్యాంకు ఖాతాల్లో విడతల వారీగా జమ అవుతాయని తెలిపారు. ఈ మొత్తాన్ని రైతులు తమ పంట పెట్టుబడికి ఉపయోగించి వ్యవసాయం లాభసాటి చేసుకోవాలని ఆయన కోరారు. రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి శ్రీను, పత్వరిగూడెం సర్పంచ్ కూరం అర్జునరావు, ఉప సర్పంచ్ బొల్లికొండ నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ఏ.డి.ఏ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏ.ఈ.ఓ కేశవ రావు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాల పనితీరుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



**చిన్నకోడూరు, జూన్ 30:**
చిన్నకోడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ మరియు సీహెచ్‌వో సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని సిబ్బంది తెలియజేయగా, జిల్లా కలెక్టర్ వారితో వీడియో కాల్ ద్వారా మాట్లాడి నిజనిర్ధారణ చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేస్తున్నట్లు వారు వివరించారు.క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే ముందు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయాలని, అలాగే ఫీల్డ్ సందర్శనకు సంబంధించిన వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని మెడికల్ ఆఫీసర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## భానూరు, క్యాసారంలో రూ.30 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

**పటాన్చెరు, జూన్ 30:**
గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలంలోని భానూరు, క్యాసారం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.30 లక్షల



వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సర్పంచులు శాంతయ్య, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, గ్రామపంచాయతీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చురకలు

బుధవారం 01 జూలై 2026

# సిగాచి మృతులకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి



జీఎంఆర్

**పటాన్చెరు, జూన్ 30:**
సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనకు ఏడాది పూర్తయినా మృతుల కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం విఫలమయ్యాయని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. సీఎం ప్రకటించిన రూ.కోటి పరిహారం ఇప్పటికీ అమలు కాలేదన్నారు.సిగాచి దుర్ఘటన వార్షిక సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం బీపీఎల్ చౌరస్తాలో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళుల ర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రమాదంలో 54 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ.కోటి నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవితాంతం పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జీఎంఆర్ పరామర్శ

**అమీన్పూర్, జూన్ 30:**
బీరంగూడ డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ కాలనీలో ఓ అపార్ట్మెంట్‌లో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాన్ని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి అపార్ట్మెంట్‌లో తప్పనిసరిగా అగ్నిమాపక భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, శ్రీకాంత్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



# ముస్త్యాల హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పదవి విరమణ



**చేర్యాల రూరల్, జూన్ 30:**
సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో ముస్త్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండరి పద్మలత ఉద్యోగ విరమణ వీడ్కోలు అభినందన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సీపీఎం బృందం పాల్గొని వారికి శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో మాట్లాడుతూ పద్మలత సేవలు అమోఘమైనవని తన ఉద్యోగ కాలంలో క్రమశిక్షణగా అంకితభావంతో నిబద్ధతతో పనిచేశారని తను తన బాల్యంలో ఈ పాఠశాలల్లోనే ప్రాథమిక విద్యను అభ్యసించి ప్రధానోపాధ్యా యురాలుగా ఇక్కడే తన సొంత గ్రామంలో విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దే రకంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ నేటితో పూర్తిచేసు కుంటున్న సందర్భంలో, తను తన కుటుంబం ఆయురారోగ్యాలతో అష్టైశ్వ ర్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని, భవిష్యత్తులో సమాజ మార్పు కోసం తమ వంతు బాధ్యతగా కృషి చేస్తూ ముస్త్యాల పాఠశాలను మరవకుండా ఎల్లప్పుడూ సందర్శిస్తూ విద్యార్థినీ, విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేయాలని కోరుతూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శులు గుండ్ర రవీందర్, ఎండి ఎజాస్ లు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆహార నాణ్యతపై రాజీ పడొద్దు

- విద్యార్థులకు భోజనం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించం
- సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి



**చిన్నకోడూరు, జూన్ 30:**
ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కామన్ డైట్ మెనూ ప్రకారం తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు రుచికరమైన తగినంత ఆహారం అందించాలని, విద్యార్థులకు ఆహారం అందించడంలో రాజు పడితే సహించేది లేదని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అన్నం, సాంబారు, వంకాయ–ఆలుగడ్డ–టమాటాతో తయారు చేసిన కూరలను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరుకు అనుగుణంగా సరిపడా కూరగాయలు వినియోగిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. విద్యార్థులకు సరిపడేంత ఆహారాన్ని వండి వడ్డించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్, భోజనం నాణ్యత, మెనూ అమలు, ఆహారం అందరికీ సరిపోతుందా అనే విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని, అందరికీ సరిపడా అందుతున్నదని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహారాన్ని బాగా నమిలి తినాలని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని భావించి వృథా చేయకుండా శుభ్రంగా తినాలని సూచించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని, అన్ని రకాల కూరగాయలను ఇష్టంగా తినాలని విద్యార్థులకు సూచించారు. అలాగే కూరల నాణ్యత, రుచిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉప్పు–కారం సమపాళ్లలో వేసి రుచికరంగా వండాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఆదేశించారు. పిల్లలు ఏది పెట్టినా తింటారనే నిర్లక్ష్య వైఖరిని సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సలీం తదితరులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- సహజ మరణానికి రూ.5 లక్షలకు పెంచాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం



**దుబ్బాక ప్రతినిధి, జూన్ 30:**
భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, సహజ మరణానికి రూ.ఐదు లక్షలకు పెంచాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక తహశీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి తహశీల్దార్ మోతిసింగ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ట్రెయిల్ బ్లెజర్ అనే బ్రోకర్స్ సంస్థ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీ ట్రెయిల్ బ్లెజర్ అనే బ్రోకర్స్ సంస్థకు ఇవ్వడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సిఎస్సి హెల్త్ టెస్టులు చేస్తూ రూ.750 కోట్లకు పైగా ఆ సంస్థకు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులను దుబారా చేస్తున్నారని విమర్శించారు.1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే నియమించాలని అన్నారు. ఈ సంవత్సరంలో కార్మికులకు చెల్లించిన నష్టపరిహారాలు రూ.140 కోట్లు మాత్రమేనని సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. బోర్డు నుండి డేటా ఇవ్వలేదని సాకు చూపి వేలాది మంది కార్మికులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొని వందల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోచుకుంటున్నాయనీ విమర్శించారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చుల వంటి తదితర స్కీములను ప్రభుత్వం, బోర్డు అధికారులు అనేక కారణాలు చూపి కార్మికులకు అందకుండా చేస్తున్నారనీ, నష్టపరిహారాలకు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలనీ, రెన్యువల్ కాని 13 లక్షల మంది కార్మికుల లేబర్ కార్డులను యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు బోర్డు ద్వారా పెన్షన్ నెలకు రూ.6,000, పిల్లల చదువులకు స్కాలర్షిప్ లు గృహ వసతి, అడ్డాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మాడవోయిన నాగరాజు, కార్యదర్శి చెట్టి శ్రీనివాస్, కార్మికులు సాజిద్, దుద్దెడ నాగరాజు, కృష్ణాహరి, వెంకటేశ్, కంపే ఎల్లయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేసిన రైతులు

- సీఎం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..

**చొప్పదండి/కొడిమ్యాల, జూన్ 30:**
జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలంలోని పూడూరు , తిర్మలాపూర్ రైతు వేదికలలో దృశ్య శ్రవణ మాధ్యమం (వీడియో కాన్ఫరెన్స్)లో ప్రత్యక్ష ప్రసారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక హైదరాబాద్ లో జరగనున్న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూడూరు రైతు వేదికలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి . భాస్కర్, మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, పూడూరు సర్పంచ్ కడారి మల్లేశం, కోడిమ్యాల సర్పంచ్ జీవన్ రెడ్డి, పూడూరు ప్యాక్స్ చైర్మన్ బండ రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ కె. రాజేష్, రామకిష్టాపూర్ సర్పంచ్ నేరెళ్ళ మహేష్, పూడూరు గౌరపూర్ ఉపసర్పంచ్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాలలపై పెరుగుతున్న నమ్మకం





- తల్లిదండ్రుల నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిలబెట్టాలి..
- మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు..
- మల్లాపూర్ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి అడ్లూరి..

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, జూన్ 30:**
గురుకుల పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుందని ఇందుకు ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులే ప్రధాన కారణం అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న అల్పాహారం, భోజనం మెనుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా కిచెన్, డైనింగ్ హాల్ తో పాటు స్టోర్ రూమ్ ను మంత్రి పరిశీలించారు. మల్లాపూర్ గురుకుల పాఠశాలకు సరఫరా చేసిన సన్న బియ్యాన్ని మంత్రి పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం ఎక్కువ ఉన్నందున బియ్యాన్ని వెనక్కి తీసుకొని సూపర్ ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని పంపించాలని పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారికి మంత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గురుకుల పాఠశాలలో 27 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్స్ తో పాటు విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల వస్తువులను అందించడానికి చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. గురుకుల పాఠశాలలో మైనర్ రిపేర్ల కోసం రూ. 69 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గురుకుల పాఠశాలలపై తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందని అందించాలని ఈ సందర్భంగా మంత్రి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. గురుకులాల్లో ఉండే విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురుకుల పాఠశాలను మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక నిధులు తీసుకువస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంత్రి వెంట ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లనాయక్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆరోగ్య సేవలు ప్రజలకు నూటికి నూరు శాతం అందించాలి

- ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆన్‌లైన్ సమీక్ష



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 30:** జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం అందేలా సమర్థవంతంగా అమలు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆన్‌లైన్ జూమ్ సమావేశం నిర్వహించి ఆరోగ్య సేవల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరై ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన వాతావరణం, మరుగుదొడ్ల నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచి రోగులకు అనుకూలమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు, ఇతర మౌలిక వసతులను వెంటనే గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఆదర్శవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ ఆన్‌లైన్ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితదేవి, జిల్లా స్థాయి ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ కోసం పోరాటం ఉధృతం చేస్తాం

- బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సాయి బాషా

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 30:** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున విధానాలు చేశారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఎనిమిది వేల కోట్ల ఫీజు రెయిన్బో వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి బాషా అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ పాటిల్, అధికార ప్రతినిధి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటీయూ వినతి:**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి , జూన్ 30:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బాచుపల్లి మండల ఎమ్మార్వో (ఎంఆర్వో) వాణి రెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించకుండా, వెల్ఫేర్ బోర్డు ద్వారానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఎస్సి హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని, సహజ మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే జీవో నెం.12ను రద్దు చేసి, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6,000 పింఛన్ మంజూరు చేయాలని, అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 22-07-2025న విడుదల చేసిన జీవో నెం.12 ప్రకారం ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత మరియు పాక్షిక అంగవైకల్య పథకాలను ప్రైవేటు బీమా కంపెనీల ద్వారా అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. జీవో విడుదలైన వెంటనే ట్రెయిల్ బ్లెజర్ బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లను ప్రైవేటు బీమా కంపెనీలకు బదిలీ చేశారని ఆరోపించారు. కార్మికులకు ప్రయోజనం లేని సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో రూ.750 కోట్లకు పైగా వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులను ఖర్చు చేశారని, కేంద్ర చట్టాలు మరియు రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేటు సంస్థలకు వందల కోట్ల రూపాయలు కట్టబెట్టడం దుర్మార్గమని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు వెంకట్రాజ్యం, మండల నాయకులు పి. భాస్కర్, పి. స్వామి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప నగర్ కాలనీలోని రోడ్ల మరమ్మతులు..

- సీసీరోడ్ల నిర్మాణంకోసం వినతి..
- గతంలో జరిగిన వివక్షను విడనాడాలని.. ప్రస్తుత కమిషనర్ పాలకవర్గం పట్టించుకోవాలని విజ్ఞప్తి..





**గజ్వేల్ ప్రతినిధి, జూన్ 30:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని అయ్యప్ప నగర్ కాలనీలో గల రాజీవ్ పార్క్ రోడ్డు నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు గల ప్రధాన రోడ్డును అమృత్ సంస్థ వారు పైపులైన్ పనుల నిమిత్తం రోడ్డును ఒకవైపు డ్రిల్లింగ్ మిషన్ల సహాయంతో మంచిగా ఉన్న రోడ్డును తవ్వి పైపులైనుల మరమ్మతుల అనంతరం అలానే వదిలేశారని, ఆ రోడ్డును ప్రయాణికులకు సౌకర్యంగా యధావిధిగా మరమ్మతులు చేపించాలని అయ్యప్ప నగర్ కాలనీవాసులు స్థానిక మున్సిపల్ కమిషనర్, చైర్మన్లకు మంగళవారం వినతి పత్రం అందించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, ప్రధాన కార్యదర్శి మోతె వీరారెడ్డి, సభ్యులతో కలిసి మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి అయ్యప్ప నగర్ కాలనీలోని రహదారులపై వివక్ష చూపిస్తున్నారని గతంలో చాలాసార్లు కాలనీలోని రోడ్లను మరమ్మతులు చేపించాలని సీసీ రోడ్లుగా మార్చాలని అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. గతంలో మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు ప్రజలు నివాసము లేని ఓపెన్ ప్లాట్ల వద్ద అవసరం లేని రోడ్లలో సీసీ రోడ్లు వేశారని, నిత్యం ప్రజలు కాలనీవాసులు ప్రయాణించే గజ్వేల్ పట్టణంలోని రాజీవ్ పార్కు, రాజిరెడ్డి పల్లి గ్రామము, మహంకాళి దేవాలయముకు ప్రజలు వెళ్లే దారి అయినటువంటి అయ్యప్ప నగర్ కాలనీ ప్రధాన రోడ్లను నిర్లక్ష్యం చేసినారని అన్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం కమిషనర్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి ప్రధాన కాలనీ అయిన అయ్యప్ప నగర్లోని రోడ్లను పట్టించుకోవాలని విజ్ఞప్తి చేసినామని అన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తిపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించినారని ఆనందం వ్యక్తపరిచినారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, ప్రధాన కార్యదర్శి మోతే వీరారెడ్డి, కోశాధికారి అలివేలు నారాయణరెడ్డి, కాలనీ సభ్యులు వగ్గు మల్లేశం, ఎంకన్నగారి గోపాల్ రెడ్డి, గురప్పగారి శ్రీరాములు, రేకుల కృష్ణారెడ్డి, బుస్స పండరి, కొట్టాల యాదగిరి, రంగు శ్రీనివాస్, కోల సూర్యారావు, కాశిరెడ్డి బాల్ రెడ్డి, నాగరాజు, గుజ్జేటి కిరణ్, మారుపల్లి సంజయ్, కాశిరెడ్డి సాయిచరణ్ రెడ్డి పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికై నిరంతరం కృషి

- పట్టణంలో నాణ్యతతో అభివృద్ధి పనులు..
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల ప్రతినిధి, జూన్ 30:** జగిత్యాల పట్టణ శ్రీ శివాంజనేయ ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్లు, కో ఆప్షన్లను సత్కరించిన ఆలయ చైర్మెన్, ఆలయ కమిటీ సభ్యులు. అంతకుముందు శివాంజనేయ ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, జగిత్యాల పట్టణం లో నాణ్యతతో పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశానని, మానవ సేవే మాధవ సేవని, హాస్పిటల్, ఆధ్యాత్మికత రెండు సేవా చేసే అదృష్టం భగవంతుని ఆశీస్సులతోనే సాధ్యమైందని అన్నారు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 60 కంటి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో 750 పడకల ఆసుపత్రి సేవలు అందుబాటులోకి రానున్నాయి. 235 కోట్లతో నూతన ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది. 62 కోట్లతో జగిత్యాల పట్టణంలో సీసీ రోడ్డు డ్రైనేజీ ల సమస్యలకు శాశ్వత పరిష్కారం అని అన్నారు. భక్తి భావన తోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో నాయకులు సమిండ్ల శ్రీనివాస్, గట్టు సతీష్, గిరి నాగభూషణం, కొత్త ప్రతాప్, కొత్త మోహన్, ప్రశాంత్ రావు, శ్రీనివాస్, బిక్షపతి, సాయి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పదవీ విరమణ పొందిన అంజయ్యకు ఘన సన్మానం

**కొమురవెల్లి, జూన్ 30:** కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ఎలక్ట్రికల్ సహాయ ఇంజనీర్ గా పనిచేసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి బదిలీ అయి పదవీ విరమణ పొందిన బ్రాహ్మణపల్లి అంజయ్యను మంగళవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అంజయ్య గురించి మాట్లాడుతూ 1985లో మల్లికార్జున స్వామి దేవాలయంలో ఎలక్ట్రిషన్ గా ఉద్యోగంలో చేరి సహాయ ఇంజనీర్ గా పదోన్నతి పొంది 2024వ సంవత్సరములో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి బదిలీ అయి నేడు పదవీ విరమణ పొందుతున్న అంజయ్య సేవలు మరువ లేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పడిగన్నగారి ఆంజనేయులు, వేద పండితులు శబరిషన్, మధుసూదన్ శర్మ, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది దేశపతి శంకర్ శర్మ, సందీప్, విజయ్ కుమార్, కనకయ్య, హైమత్ తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర ఓటరు సవరణకు ప్రజలు సహకరించాలి



**కొమురవెల్లి, జూన్ 30:** సమగ్ర ఓటరు సవరణకు ప్రజలు సహకరించాలని కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారధి పిన్నింటి రత్నం కోరారు. జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ వెన్నెలక్క ఆదేశాల మేరకు ఓటర్ సవరణ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం పాటను రిలీజ్ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఇంటికి బిఎల్ఓ అధికారులు ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకొని రావడం జరుగుతుందని వారికి సరైన సమాచారం అందించి ఓటును కోల్పోకుండా చూసుకోవాలని అన్నారు. ఒక్క ఓటు రెండు చోట్ల ఉంటే తొలగిస్తారని బిఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించాలని ఆయన మీడియా ద్వారా ప్రజలకు తెలిపారు.

# రైతులకు ఇచ్చిన హామీలు విస్మరించారని మండిపాటు

- బీఆర్ఎస్ నేత వీరారెడ్డి నరేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 30:** ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని రైతులకు ఎకరాకు రూ.7,500 చొప్పున రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం ఆ హామీలను అమలు చేయడంలో విఫలమై రైతులను నిరాశపరిచిందని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. రెండు సీజన్లకు రైతులకు అందాల్సిన మొత్తం రూ.55,800 కోట్లలో ఇప్పటివరకు కేవలం రూ.27,080 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, ఇంకా రూ.28,720 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. హామీలు ఇచ్చి మరచిపోవడం సరైన విధానం కాదని, రైతు చెమటకు గౌరవం ఇవ్వాలని, రైతు భరోసా పేరుతో రైతులను మోసం చేయడం తగదని ఆయన అన్నారు. రైతులకు రావాల్సిన ప్రతి రూపాయిని వెంటనే విడుదల చేసి, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుందని, రైతు సంక్షేమమే తెలంగాణ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని వీరారెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# పోచమ్మ బస్తీలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, జూన్ 30:** గాజులరామారం దేవేందర్ నగర్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో ఇటీవల నిర్వహించిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం, బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన ఓడిబియ్యంతో మంగళవారం ఘనంగా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల జూన్ 24, 25 తేదీల్లో భక్తి శ్రద్ధలతో జరిగిన ఉత్సవాల్లో అమ్మవారికి సమర్పించిన ఓడిబియ్యాన్ని సంప్రదాయ బద్ధంగా భద్రపరిచి, అదే బియ్యంతో తయారు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రముఖులు, భక్తులు సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అన్నదాన సేవ ద్వారా అమ్మవారి కృపా కటాక్షాలు అందరికీ లభించాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు గోపాల్ గౌడ్, అధ్యక్షులు సంధ్యారెడ్డి, సలహాదారులు దశరథ్, జగన్, ఉపాధ్యక్షులు రఘునాథ్ యాదవ్, సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి మహావీర్, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, ఉపేందర్, వినోద్, సుజాత, పుష్ప, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన పిడతల

## నేడు పిడతల రంగారెడ్డి వర్ధంతి

ఆయన ఒక అరుదైన నాయకుడు. ఏకగ్రీవంగా శాసన మండలికి ఎన్నికైన వ్యక్తి. శాసన సభ, శాసన మండలి రెండింటికీ అధ్యక్షునిగా ఎన్నికైన అరుదైన, అపూర్వ రికార్డును సొంతం చేసుకుని సమర్థ వంతంగా ఉభయ సభలను నడిపి, సామర్థ్యాన్ని చాటి చెప్పిన ఘనుడు. పలు మార్లు జైలు శిక్ష అనుభవించిన ఉద్యమ కారుడు. ప్రావెన్షియల్ పార్లమెంటేరియన్. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ తొలి అధ్యక్షుడు. బహుభాషా కోవిదుడు. పాత్రికేయుడు. ఆయనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేసిన పిడతల రంగారెడ్డి. పిడతల రంగారెడ్డి (నవంబర్ 10, 1917 – జూలై 1, 1991), ఆంధ్రప్రదేశ్ కు చెందిన రాజకీయ నాయకుడు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకరు, శాసనమండలి అధ్యక్షుడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండు సభలకు (శాసనసభ, శాసనమండలి) అధ్యక్షుడిగా పనిచేసిన ఏకైక వ్యక్తి. గిద్దలూరు శాసనసభ నియోజక వర్గం నుండి నాలుగుసార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. గిద్దలూరు శాసనసభ నియోజవర్గం ఏర్పడక ముందు 1952లో తొలిసారిగా కంభం శాసనసభ నియోజవర్గం నుండి గెలిచి శాసనసభ సభ్యుడయ్యారు.

పిడతల రంగారెడ్డి... ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన పిడతల వెంగళరెడ్డి, పిచ్చమ్మలకు 1917, నవంబర్ 10న రంగారెడ్డి జన్మించారు. 1937లో కొత్తపట్నంలో కాంగ్రెసు పార్టీ సోషలిష్టు విభాగం నేతృత్వంలో జరిగిన రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందారు. 1939లో గిద్దలూరులో వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని ఐదు వందల రూపాయల జరిమానా చెల్లించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష అనుభవించారు. 1940 కర్నూలు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, సత్యాగ్రహంలో పాల్గొని జరిమానా చెల్లించటంతో పాటు జైలు శిక్షను కూడా అనుభవించారు. 1941లో కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, 500 రూపాయలు జరిమానా తో బాటు 3సంవత్సరముల జైలు శిక్ష అనుభవించారు. 1950వ సంవత్సరములో మద్రాసు శాసనసభ నుండి ప్రావెన్షియల్ పార్లమెంట్‌కు ఎన్నికైనారు. విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత పిడతల రంగారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తొలి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1952–1959 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వ్యవహరించారు. పిడతల 1952వ సంవత్సరములో ఉమ్మడి మద్రాసు శాసనసభకు నేటి ప్రకాశం జిల్లా కంభం నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. 1955వ సంవత్సరములో గిద్దలూరు నియోజకవర్గం మండి ఆంధ్ర శాసనసభకు శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. ఆయన దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో 1960వ సంవత్సరం జనవరి 11వ తేదీ నుండి 1962వ సంవత్సరం మార్చి 11వ తేదీ వరకు ప్రణాళిక అభివృద్ధి, పంచాయతీరాజ్, సమాచార, ప్రచారం, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసారు. ప్రణాళిక శాఖా మంత్రిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఆ శాఖను ఆయన నడిపించిన తీరు తెన్నులు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసాయి..ఒకప్పటి పాత్రికేయుడిగా, ప్రతిరోజూ ఒక ప్రెస్‌నోట్‌తో పాత్రికేయులకు బాగా పని కల్పించేవారు. భాషావేత్త అయిన రంగారెడ్డి ఇంగ్లీషు, తమిళం, తెలుగు, హిందీ, ఉర్దూలలో అనర్గళంగా మాట్లాడేవారు.

1968వ సంవత్సరములో స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి విధాన పరిషత్తుకు పోటీ లేకుండా ఎన్నికైన రంగారెడ్డి 15.07.1968 నుండి 13.03.1972 వరకు విధాన పరిషత్తు ఛైర్మన్ గా పనిచేశారు. ఆయన విధాన పరిషత్తు ఛైర్మన్ గా సభా కార్యక్రమాలను నడిపించిన తీరు, ఆవలంభించిన విధానాలు, అన్ని పక్షాల సభ్యుల మన్ననలు, ప్రశంసలను పొందాయి. 1970వ దశకపు చివర్లో ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ మూడు వర్గాలుగా చీలిపోయినప్పుడు, ఇందిరా గాంధీకి ససేమిరా మద్దతును ఇవ్వకూడదని నిశ్చయించుకొని, పిడతల రంగారెడ్డి తన వర్గంతో అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా పార్టీలో చేరారు. 1972వ సంవత్సరములో గిద్దలూరు నియోజకవర్గం నుండి ఐదవ శాసనసభకు ఎన్నికైన ఆయన, 1972–1974 సంవత్సరాల మధ్య కాలంలో స్పీకరుగా పనిచేసి ఆ పదవికి కీర్తి ప్రతిష్టలు తీసుకు వచ్చారు. జలగం వెంగళరావు మంత్రి వర్గంలో రంగారెడ్డి ఆర్థిక, వాణిజ్య పన్నులు గృహనిర్మాణం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేసారు. ఆయన 1978వ సంవత్సరము ఆరవ శాసనసభకు, 1985వ సంవత్సరము ఎనిమిదవ శాసనసభకు గిద్దలూరు నియోజకవర్గం మండి ఎన్నికైనారు. 1985 ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తెలుగుదేశం పార్టీ ఆయనకు మద్దతునిస్తూ గిద్దలూరు శాసనసభా నియోజక వర్గంలో అభ్యర్థిని నిలబెట్టలేదు. ఆ ఎన్నికలలో గెలిచిన రంగారెడ్డి, ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి, మరణించే దాకా తెలుగుదేశం లోనే కొనసాగారు. 1985వ సంవత్సరములో ప్రోటెం స్పీకరుగా బాధ్యతలను నిర్వహించారు. శాసనసభకు మంత్రి మండలి సమిష్టి బాధ్యత వహించే పేరుతో ఒక మంత్రి తరపున వేరొక మంత్రి సమాధానాలు ఇవ్వడం, ముఖ్యమంత్రి పేరున వున్న సభా కార్యక్రమాన్ని ఇతర మంత్రులు నిర్వహించడం ఒక అలవాటుగా మారకూడదని అనివార్య కారణాల వల్లనో లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగానే ఆ విధంగా చేయాలని పేర్కొంటూ 1974 జనవరి 23వ తేదీన పిడతల రంగారెడ్డి స్పష్టంగా రూలింగు ఇచ్చి తమ వ్యక్తిత్వాన్ని చాటి చెప్పారు. రంగారెడ్డి, 1969లో ట్రినిడాడ్, టుబాగో, 1971లో మాల్నాయ్ దేశాలలో జరిగిన కామన్ వెల్త్ పార్లమెంటరీ సదస్సులలో పాల్గొన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ రష్యా మొదలైన దేశాలలో పర్యటించారు. విధాన పరిషత్తు ఛైర్మన్ గా, శాసనసభ స్పీకరుగా ఎంతోమందికి ఆదర్శ ప్రాయులైన పిడతల రంగారెడ్డి 1991 సంవత్సరము జూలై ఒకటవ తేదీన మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 'అద్వితీయం ప్రాణ దాత సేవాభావం'

## నేడు వైద్యుల దినోత్సవం

ప్రతి వృత్తీ దేనికదే సాటి అయినప్పటికీ వైద్య వృత్తి మిగిలిన వాటికి భిన్నమైనది. మృత్యువు చివర అంచులదాకా వెళ్ళిన వారికి ప్రాణం పోసే శక్తి ఈ వృత్తికి ఉంటుంది. అందుకే రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చేసే నిరంతర సేవకు ఈమాత్రం గుర్తింపుగా ప్రతి సంవత్సరము జూలై 1 వ తేదీన డాక్టర్స్ డే ని జరుపుకుంటారు. ప్రాణ ప్రదాతలను గుర్తు పెట్టుకునేందుకు ఈ రోజున డాక్టర్లందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో చల్లగా ఉండాలని దేవుని ప్రార్ధించి శుభాకాంక్షలు తెలియ జేస్తారు. అలా తెలియ జేసేందుకు సంవత్సరములో ఒకరోజు కేటాయించ బడింది. బెంగాల్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా పనిచేసిన బిధాన్ రాయ్.. రాష్ట్రంలో అనేక వైద్య సంస్థల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. జాధవ్‌పూర్ టీబీ ఆస్పత్రి, చిత్తరంజన్ సేవా సదన్, కమలా నెహ్రూ మెమోరియల్ ఆస్పత్రి, విక్టోరియా ఇన్‌స్టిట్యూషన్, చిత్తరంజన్ క్యాన్సర్ ఆస్పత్రి, చిత్తరంజన్ సేవా సదన్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ తదతర ప్రతిష్టాత్మక సంస్థలన్నీ ఆయన హయాంలో పురుడు పోసుకున్నవే. మహిళలకు సామాజిక సేవ, నర్సింగ్‌లో శిక్షణ ఇప్పించడానికి ఆయన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలకత్తా నగరానికి మేయర్ (1931–33)గానూ బిధాన్ రాయ్ పని చేశారు. స్థానిక పరిపాలనలో కీలక సంస్కరణలు తీసుకు వచ్చారు. కలకత్తా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్(1942–44)గా, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్ (1939)గా, ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గానూ ఆయన విశేష సేవలు అందించారు. 1882 జులై 1న జన్మించిన బిధాన్ రాయ్ 1962లో అదే రోజున (జులై 1) మరణించడం గమనార్హం. 1933 లో జార్జియ లోని విండార్ లో మార్చి 30 వ తేదీన తొలి డాక్టర్స్ డే ని పాటించారు . డా.చార్లెస్ బి.ఆల్మండ్ భార్య బ్రౌన్ ఆల్మండ్ వైద్యుల గౌరవార్థము ఒక రోజును కేటాయించాలని నిర్ణయించింది. గ్రీటింగ్ కార్డులు పంపడం, అసువులు బాసిన వైద్యులకు పూలతో నివాళులర్పించడం ద్వారా తొలి డాక్టర్స్ డే ఉత్సవం జరిపారు. యునైటెడ్ స్టేట్స్ లో ప్రతినిధుల సభ డాక్టర్స్ డే పాటిస్తూ1958 మార్చి 30 వ తేదీన తీర్మానం చేసింది. 1990 లో నేషనల్ డాక్టర్స్ డే పాటించాల్సిందిగా చట్టాన్ని ప్రవేశ పెట్టారు. 1990 అక్టోబర్ 30 న అధ్యక్షుడు జార్జి బుష్ మార్చి 30 న ' నేషనల్ డాక్టర్స్ డే ' గా పేర్కొంటూ చట్టం పై సంతకాలు చేశాడు. మన భారత దేశములో ప్రతియేటా జూలై 1 న నేషనల్ డాక్టర్స్ డే ని జరుపు కుంటున్నాము. ప్రముఖ వైద్యుడు డా. బి.సి.రాయ్ గౌరవార్థం ఈ



రోజును నిర్ణయించారు. రాయ్ 1882 జూలై 01 న జన్మించినారు. మన దేశంలో వైద్య రంగానికి ఎనలేని సేవలందించిన ఆ మహా మహుని జన్మదిన వేడుకలే డాక్టర్స్ డే ఉత్సవాలుగా జరుపు కుంటున్నాము. ఆయన పుట్టినరోజు .. మరణించిన రోజు ఒక్కరోజే .. అదే జూలై 1 వ తేదీ . 1962 జూలై 1 వ తేదీన మృతి చెందారు. డాక్టర్ బి.సి.రాయ్ 1882 వ సంవత్సరం జూలై ఒకటవ తేదీన బీహార్ రాష్ట్రం ,పాట్నా జిల్లాలోని బకిమ్ పూర్ లో జన్మించారు. ఆయన పూర్తి పేరు బిధాన చంద్ర రాయ్. తండ్రి ప్రకాశ్ చంద్ర ఎక్సైజ్ ఇనస్పెక్టర్. బి.సి .రాయ్ తోబుట్టువులు ఐదుగురు. తన 14వ యేట నే తల్లిని కోల్పోయారు. అవివాహితుడైన బి.సి.రాయ్ తన ఆస్తులతో పాట్నాలో ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవలకు అంకితం చేసారు . బిధాన చంద్ర రాయ్ 1909–11 మధ్య కాలంలో ఇంగ్లండ్ లోని సెంట్ బెర్త్ లోమో కాలేజీ లో వీ.=.జ్రూ మరియు ఖీ.=.జ.ూ అనే డిగ్రీలు పొందడానికి చదువు కొనసాగించి, 1911 లో స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, కోల్ కతా మెడికల్ కాలేజీలో కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేసారు. ఆయన నజాదవ్ పూర్ టి.బి.హాస్పిటల్, ఆర్.జి.ఖార్ మెడికల్ కాలేజీ, కమలా నెహ్రూ హాస్పిటల్, విక్టోరియా ఇన్స్టిట్యూట్, చిత్తరంజన్ క్యాన్సర్ హాస్పిటల్ మొదలైన సంస్థలు నెలకొల్పారు. 1926 లో ప్రత్యేకంగా మహిళల కోసం, పిల్లల కోసం చిత్తరంజన్ సేవాసదన్ అనే వైద్య శాలను ఏర్పాటు చేసారు. మహిళలకు నర్సింగ్ శిక్షణ కోసం ఒక శిక్షణా సంస్థనూ ఏర్పాటు చేసారు. రాయ్ మహాత్మా గాంధీ వ్యక్తిగత వైద్యులలో ఒకరు. దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వైద్య మండలి సభ్యులుగా కూడా ఆయన ఉన్నారు. 1925 లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. బారక్ పూర్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేసి "గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ బెంగాల్" గా పేరొందిన సురేంద్రనాథ్ బెనర్జీని ఓడించారు..1922–28 ల మధ్య కాలంలో కోల్ కతా మెడికల్ జర్నల్ కు సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. 1928 లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులైనారు. కోల్ కతా నగరానికి మేయర్ గా ఎన్నికైనారు. 1942 లో కోల్ కతా విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా, 1943 లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షులుగా నియమింప బడ్డారు. విద్య, వైద్య రంగాలలో ఆయన సేవలకు 1944 లో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయ బడింది. 1948 జనవరి 13 న పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి పదవిని చేపట్టారు. 1961 లో ఫిబ్రవరి 4 న ఆయనను భారత రత్న వరించింది. రాయ్ జయంతి రోజైన జూలై ఒకటినే వర్ధంతి కూడా కావడం విశేషమైనందున ఆయన స్మారకార్థం ప్రతీ ఏడూ జూలై ఒకటవ తేదీన వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం 1962 లో ప్రకటించింది. వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి 1976 నుంచి డాక్టర్ బి.సి.రాయ్ పేరు మీద అవార్డులను ప్రధానం చేస్తున్నారు. నేటి వైద్యులకు, వైద్య విద్యార్థులకు ఆదర్శప్రాయులు డా.బి.సి.రాయ్. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. నిబద్దత, త్యాగనిరతి వైద్యులకు ఉండాలి. తమ వ్యక్తిగత జీవితాన్ని పక్కకు పెట్టేసి తెల్లకోటుకే ప్రాధాన్యత ఇవ్వాలి. ఎదుటి వ్యక్తి ప్రాణాలు కాపాడడానికి తపన పడేవారే నిజమైన వైద్యులు. మానవ సేవే మాధవ సేవ అన్నట్లు సాగే వైద్య వృత్తిలో ఎంతగా సేవా నిరతి కలిగి ఉంటే అంతటి గొప్పవ్యక్తిగా గుర్తింపు. డాక్టర్లకు సహనము , ఓర్పు, సేవానిరతి, దయ ఉండాలి. వైద్యుడు ఎల్లప్పుడు అన్నివేలలా రోగులకు అందుబాటులో ఉండాలి. ఏ అత్యవసర పరిస్థితిలోనైనా తనకు వైద్యం చేసే డాక్టర్ అందుబాటులో ఉన్నాడన్న , ఉంటాడన్న నమ్మకము రోగికి కలిగేటట్లు వైద్యులు మెలగాలి. తను చేస్తున్న వృత్తి మీద వైద్యులకు అబిరుచి, నమ్మకము ఉండాలి. ఏదో జీవనోపాధి కోసం పనిచేయకూడదు. తను చేస్తున్న పనికి ఒక క్రమబద్దత ఉండాలి. నిర్దిష్ట మైన సమయ సారిణి ఉండాలి. ప్రతి డాక్టరూ ఎల్లప్పుడు రోగికి మంచి చేయాలనే ఆలోచించాలి. ఫీజు తీసుకున్నా, తీసుకోక పోయినా తను చేసే సేవ ఒకేలా ఉండాలి. రోగికి, వైద్యునికి మధ్య నమ్మకం అనే బంధము ఉండాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# విత్తన జీవితం.. దేశానికి రైతు సేవ అంకితం

## నేడు ప్రపంచ వ్యవసాయ దినోత్సవం

ప్రతి సంవత్సరం జూలై 1న నిర్వహించే ప్రపంచ వ్యవసాయ దినోత్సవం, మానవ జాతి జీవనాధారమైన వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను గుర్తుచేసే సందర్భం. ఈ రోజు అన్నదాతల కృషిని గౌరవించడం, వ్యవసాయ రంగానికి అంకితభావంతో పని చేసే ప్రతి ఒక్కరికి అభినందన తెలిపే ఉదాత్త సందేశాన్ని ప్రసారం చేస్తుంది. ఇది కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు... భవిష్యత్తు ఆహార భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణాభివృద్ధికి, సమాజ సమతుల్యతకు మూలమైన వ్యవసాయాన్ని మనస్ఫూర్తిగా ఆలోచించే రోజు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూలై 1న ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని నిర్వహించడం ఒక భావోద్వేగ పూరిత సందేశాన్ని అందిస్తుంది. వ్యవసాయ రంగం కేవలం ఆహారం పండించే వృత్తిగా మాత్రమే కాకుండా మానవ జీవన రేఖగా, పర్యావరణ పరిరక్షకంగా, సమాజాభివృద్ధికి ప్రేరణగా నిలుస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా అన్నదాతల కృషికి అభినందన తెలుపుతూ, భవిష్యత్ సవాళ్లను పరిష్కరించే దిశగా సామూహిక చింతన అవసరమవుతుంది. వ్యవసాయం కేవలం పంటలు పండించడం అనే అర్థానికి మాత్రమే పరిమితమయ్యే రంగం కాదు. ఇది ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, కోట్లాది మందికి ఉపాధి మార్గం, సమాజ సంస్కృతికి ప్రాణనాడి, పర్యావరణ సమతుల్యతకు నిర్ధారక శక్తి. గ్రామీణ జీవితానికి పునాది వేసే వ్యవసాయం మన సంస్కృతి, ఆచారాలతో సైతం జతపడి ఉంది. పండుగలు, పంటల కట్టుబాట్లు, వర్షాకాలపు వేడుకలు అన్నీ వ్యవసాయ దశల ఆధారంగా రూపుదిద్దుకున్నవే. వ్యవసాయ రంగం ప్రపంచ జనాభాలో దాదాపు 26 శాతం మంది ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్ మందికి పైగా ప్రజలు నేరుగా వ్యవసాయ సంబంధిత రంగాల్లో పని చేస్తున్నారు. భారతదేశం లోనే సుమారు 54 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2023–24 గణాంకాల ప్రకారం భారత దేశంలో వ్యవసాయ రంగం జాతీయ స్థూల ఉత్పత్తిలో (+ణూ) సుమారు 18.3 శాతం వాటా కలిగి ఉంది. ఈ రంగం ద్వారా ముడి సరుకులు, ఆహారం, జాతికి జీవనాధారం లభించడమే కాకుండా, పలు పరిశ్రమలకు మౌలిక మద్దతు లభిస్తోంది. ఉదాహరణకు, పత్తి, చెరకు, నూనె గింజలు, ధాన్యాలు వంటి పంటల ద్వారా వస్త్ర, చక్కెర, నూనె పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో వాతావరణ మార్పులు కీలకంగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పంటల దిగుబడిపై



దుష్ప్రభావం పడుతోంది. ఐపీసీసీ నివేదికల ప్రకారం 2050 నాటికి వర్షాధారిత సాగు ప్రాంతాలలో 10–25 శాతం దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. భారత దేశంలో తూర్పు రాష్ట్రాల నుంచి పశ్చిమ ప్రాంతాల దాకా వాతావరణ అస్థిరతలు రైతులకు నష్టాలను కలిగిస్తున్నాయి. నీటి కొరత, భూసార హీనత, వ్యవసాయ రుణ భారం, మార్కెటింగ్ లో అసమతుల్యత, మధ్యవర్తుల వలయంలో రైతు ఆదాయం తగ్గిపోవడం వంటి అంశాలు రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తు ఆహార అవసరాలను తీర్చాలంటే వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగానికి ఆధునికతను చేర్చడం అత్యవసరమవుతోంది. స్మార్ట్ ఫార్మింగ్, డ్రోన్ సాంకేతికత, భూసార పరీక్షా పద్ధతులు, మైక్రో ఇరిగేషన్ పద్ధతులు, డిజిటల్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఖీూాం) వంటి ఆధునిక విధానాల ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చు. దీనివల్ల నూతన తరం యువత వ్యవసాయాన్ని ఆదాయ సాధక రంగంగా భావించే అవకాశముంది. అంతేకాదు, సుస్థిర వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా పర్యావరణానికి హాని లేకుండా సాగు కొనసాగించవచ్చు. జీవ వ్యవసాయం, సహజ వ్యవసాయం, మల్చింగ్, ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్‌మెంట్ వంటి పద్ధతులు భవిష్యత్‌లో వ్యవసాయ భద్రతను నిర్ధారించ గలవు. ప్రపంచ వ్యవసాయ దినోత్సవం వ్యవసాయ రంగానికి నూతన దిశలను సూచించే, రైతులకు మానసిక, సాంకేతిక, ఆర్థిక మద్దతును చాటే ఒక చైతన్య దినంగా నిలవాలి. ఈ రోజు రైతు సమస్యలపై చర్చించడమే కాకుండా, సమగ్ర వ్యవసాయ విధానాలు, గవర్నెన్స్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యత, విద్యా రంగంలో వ్యవసాయాన్ని ప్రధానాంశంగా చేర్చడం వంటి అంశాలపై దృష్టి సారించాలి. రైతు చెమటే మన దేశ అభివృద్ధికి మూలాధారం. ఆ చెమట విలువను గుర్తించడం, వ్యవసాయ రంగాన్ని ఆదునికతతో మేళవించడం మనందరి బాధ్యత. వ్యవసాయం మన వంటలపై మాత్రమే కాదు – మన దేశపు భద్రత, మనుగడ, సమాజ సంస్కృతి, పర్యావరణపై ప్రభావం చూపే రంగం. అలాంటి రంగానికి అంకితమైన ఈ దినోత్సవాన్ని కేవలం జ్ఞాపకార్థ దినంగా కాక, రైతు జీవితాన్ని వెలిగించే ఉద్యమ దినంగా మలచుకుందాం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# భారీగా తగ్గిన బంగారం

**హైదరాబాద్, జూన్ 30 :** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం పసిడి ధరలు గణనీయంగా తగ్గాయి. దీంతో ఇటీవల వరుసగా పెరుగుతున్న బంగారం ధరలతో ఆందోళన చెందిన కొనుగోలుదారులకు కొంత ఉపశమనం లభించింది. బంగారం ధరల్లో తగ్గుదల నమోదు కావడంతో నగలు కొనుగోలు చేయాలనుకునే వారు, పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడలో పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర రూ.1,40,130గా నమోదైంది. ఇరవై రెండు క్యారెట్ల ఆభరణాల బంగారం పది గ్రాముల ధర రూ.1,28,450గా ఉండగా, పద్దెనిమిది క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,05,100గా ఉంది. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో ఇదే ధరలు కొనసాగుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో మాత్రం స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. చెన్నైలో పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర రూ.1,45,080గా ఉండగా, ఇరవై రెండు క్యారెట్ల బంగారం ధర రూ.1,32,990గా ఉంది. న్యూఢిల్లీలో ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం రూ.1,40,280, ఇరవై రెండు క్యారెట్ల బంగారం రూ.1,28,600గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళ రాష్ట్రాల్లో హైదరాబాద్‌తో సమానంగా ధరలు కొనసాగుతున్నాయి. అహ్మదాబాద్‌లో మాత్రం స్వల్పంగా ఎక్కువ ధరలు నమోదయ్యాయి.

బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకునే మార్పులు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, దిగుమతి సుంకాలు, దేశీయంగా కొనుగోలు డిమాండ్, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు వంటి అనేక అంశాల ప్రభావంతో ప్రతిరోజూ మారుతూ ఉంటాయి. అందువల్ల కొనుగోలు చేసే ముందు స్థానిక బంగారం వ్యాపారుల వద్ద తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకోవడం మంచిదని వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి.

# నీరుకొరతతో భారీ పెట్టుబడి అవకాశాలు

**న్యూఢిల్లీ, జూన్ 30 :** 2030 నాటికి దేశంలో అందుబాటులో ఉన్న నీటి సరఫరాతో పోలిస్తే డిమాండ్ రెట్టింపు స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సంస్థ పీఎల్ క్యాపిటల్ విడుదల చేసిన నివేదిక హెచ్చరించింది. ఈ పరిస్థితి కారణంగా నీటి రంగంలో దాదాపు రూ.20 లక్షల కోట్ల భారీ పెట్టుబడి అవకాశాలు ఏర్పడతాయని ఆ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా జల శుద్ధి, మురుగునీటి శుద్ధి, రీసైక్లింగ్ మరియు నీటి మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాల్లో పెద్ద అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది. దేశ జనాభాలో సుమారు 18 శాతం ఉన్న భారతదేశంలో ప్రపంచ తాగునీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే అందుబాటులో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, భూగర్భ జలాల తగ్గుదల, వ్యవసాయంలో నీటి వినియోగం పెరగడం వంటి కారణాలతో నీటి కొరత మరింత తీవ్రమవుతోందని నివేదిక వెల్లడించింది. నీటి భద్రతను దృష్టిలో పెట్టుకుని శుద్ధి, నిల్వ, పంపిణీ, పునర్వినియోగ వ్యవస్థలపై భారీ పెట్టుబడులు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం ఆర్థిక రంగం మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుతో ముడిపడిన కీలక అంశమని పీఎల్ క్యాపిటల్ ప్రతినిధులు పేర్కొన్నారు. మురుగునీటి శుద్ధి రంగంలోనే అత్యధిక అవకాశాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా రోజుకు వేల మిలియన్ లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతున్నప్పటికీ, శుద్ధి సామర్థ్యం తక్కువగా ఉండటంతో పర్యావరణానికి ముప్పు పెరుగుతోందని తెలిపింది. ఈ లోటును పూడ్చేందుకు కొత్త శుద్ధి కేంద్రాలు, పునర్వినియోగ ప్రాజెక్టులు వేగంగా పెరగాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జల జీవన్ మిషన్, అమృత్ 2.0, నమామి గంగే వంటి పథకాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు మరియు మురుగునీటి నిర్వహణకు చర్యలు తీసుకుంటోంది. అదే సమయంలో డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి పరిశ్రమల కారణంగా భవిష్యత్తులో నీటి డిమాండ్ మరింత పెరగనుందని నివేదిక హెచ్చరించింది.



# మైక్రోసాఫ్ట్‌కు భారీ ఎదురుదెబ్బ

**వాషింగ్టన్, జూన్ 30 :** ప్రపంచ సాంకేతిక రంగ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్‌కు జూన్ నెల తీవ్ర నిరాశను మిగిల్చింది. కంపెనీ షేర్లు భారీ ఒత్తిడిని ఎదుర్కొనడంతో మార్కెట్ విలువలో ఏకంగా 570 బిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.49 లక్షల కోట్లకు పైగా క్షీణించింది. 2000 సంవత్సరంలో సంభవించిన డాట్‌కామ్ సంక్షోభం తర్వాత మైక్రోసాఫ్ట్‌కు ఇదే అత్యంత ప్రతికూల నెలగా మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత పాతికేళ్లలో కంపెనీ మార్కెట్ విలువ ఇంత భారీ స్థాయిలో ఒక్క నెలలో క్షీణించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇటీవలి కాలంలో కృత్రిమ మేధస్సు రంగంపై మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఆధునిక డేటా కేంద్రాల నిర్మాణం, కృత్రిమ మేధస్సుకు అవసరమైన ప్రత్యేక చిప్‌ల తయారీ, అధునాతన మౌలిక సదుపాయాల విస్తరణ కోసం బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు కేటాయించింది. అయితే ఈ పెట్టుబడుల ద్వారా తక్షణ ఫలితాలు కనిపించకపోవడం, లాభాల వృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోవచ్చనే అంచనాలు పెట్టుబడిదారుల్లో ఆందోళనకు దారితీశాయి. దాంతో జూన్ నెలలో మైక్రోసాఫ్ట్ షేర్లు సుమారు 17 శాతం వరకు క్షీణించాయి. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు విస్తృతంగా వినియోగంలోకి వస్తే సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలపై డిమాండ్ తగ్గే అవకాశముందన్న ఆందోళన కూడా షేర్ల పతనానికి ఒక ప్రధాన కారణంగా మారింది. సంస్థ భవిష్యత్ ఆదాయ వృద్ధిపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఇటీవల విడుదల చేసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో మైక్రోసాఫ్ట్‌కు చెందిన క్లౌడ్ సేవల విభాగం వృద్ధి మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. ముఖ్యంగా అజ్యూర్ క్లౌడ్ సేవల విస్తరణ ఆశించినంత వేగంగా లేకపోవడం పెట్టుబడిదారులను నిరాశపరిచింది. అదే సమయంలో ఈ ఏడాది చివరి నాటికి అజ్యూర్ క్లౌడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు 190 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు సంస్థ ప్రకటించడం కూడా మార్కెట్‌లో ఆందోళనను మరింత పెంచింది. అయితే ఈ పరిణామాలపై మార్కెట్ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు విశ్లేషకులు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది మంచి కొనుగోలు అవకాశమని భావిస్తుండగా, మరికొందరు మాత్రం కృత్రిమ మేధస్సుపై చేసిన భారీ పెట్టుబడులు ఎలాంటి ఫలితాలు ఇస్తాయో స్పష్టత వచ్చే వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ సాంకేతిక రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పెట్టుబడిదారుల ఆందోళనలు మైక్రోసాఫ్ట్ షేర్లపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.




# జూలై 4 నుంచి అమెజాన్ మెగా సేల్




**న్యూఢిల్లీ, జూన్ 30 :** ప్రముఖ ఈ-వాణిజ్య సంస్థ అమెజాన్ నిర్వహించే వార్షిక మెగా డిస్కౌంట్ ఉత్సవం 'ప్రైమ్ డే-2026' తేదీలను సంస్థ అధికారికంగా ప్రకటించింది. జూలై 4 అర్ధరాత్రి నుంచి జులై 6 వరకు వరుసగా 72 గంటల పాటు ఈ ప్రత్యేక విక్రయాలు కొనసాగనున్నాయి. భారతదేశంలో అమెజాన్ ప్రైమ్ సేవలకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి మరింత ఆకర్షణీయమైన ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు సంస్థ ఏర్పాట్లు చేసింది. ఈ ప్రత్యేక విక్రయాలు కేవలం ప్రైమ్ సభ్యులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ టెలివిజన్లు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తదితర విభాగాలపై భారీ ధర తగ్గింపులు కల్పించనున్నారు. ప్రముఖ బ్రాండ్లకు చెందిన ప్రీమియం మెబైల్ ఫోన్లు, మధ్యస్థ శ్రేణి పరికరాలు, అత్యాధునిక ల్యాప్‌టాప్‌లు ప్రత్యేక ధరలకు విక్రయించనున్నట్లు సంస్థ వెల్లడించింది. స్మార్ట్ టెలివిజన్ల విభాగంలో ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై గరిష్ఠంగా 75 శాతం వరకు ధర తగ్గింపులు ఉండనున్నాయి. అదనంగా కొన్ని ఎంపిక చేసిన బ్యాంకుల క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వినియోగదారులకు 10 శాతం తక్షణ రాయితీ లభిస్తుంది. అమెజాన్‌కు అనుబంధంగా ఉన్న ప్రత్యేక క్రెడిట్ కార్డు వినియోగదారులకు అదనపు నగదు తిరిగి చెల్లింపు సదుపాయం కూడా కల్పించారు. అలాగే ఒకేసారి మొత్తం చెల్లించలేని వారికి అదనపు వడ్డీ లేకుండా నెలవారీ వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసే అవకాశం కూడా అందుబాటులో ఉంటుంది. ప్రైమ్ సేవలకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా సభ్యత్వ రుసుములపై కూడా సంస్థ ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. వార్షిక సభ్యత్వాన్ని గతంతో పోలిస్తే తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురాగా, ఇతర సభ్యత్వ పథకాల ధరలను కూడా తగ్గించింది. దీంతో కొత్తగా సభ్యత్వం తీసుకునే వినియోగదారులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. ఈ 72 గంటల మెగా విక్రయాల సందర్భంగా ఐదు వందలకు పైగా కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. సాంకేతిక పరికరాలతో పాటు గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఆరోగ్య సంరక్షణ, అందాల ఉత్పత్తులు, వంటింటి సామగ్రి తదితర విభాగాల్లో కూడా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. తక్కువ ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఈ మెగా సేల్ మంచి అవకాశంగా నిలవనుంది.




# యూపీఐతోనే పీఎఫ్ నగదు

## కొత్త విధానానికి సన్నాహాలు

**న్యూఢిల్లీ, జూన్ 30 :** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ సభ్యులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ కొత్త విధానాన్ని తీసుకురానుంది. ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాలోని నగదును నేరుగా యూపీఐ లేదా నగదు యంత్రాల ద్వారా పొందేలా 'ఈపీఎఫ్ఓ 3.0' పేరుతో కొత్త వ్యవస్థను రూపొందిస్తోంది. ఈ విధానం అమల్లోకి వస్తే నగదు ఉపసంహరణ ప్రక్రియ మరింత వేగవంతం కావడంతో పాటు సభ్యులకు ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈ కొత్త సౌకర్యాన్ని పొందాలంటే సభ్యుల సార్వత్రిక ఖాతా సంఖ్యను ఆధార్‌తో అనుసంధానం చేసి ఉండాలి. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు, శాశ్వత ఖాతా సంఖ్య, మొబైల్ నంబరు తదితర వివరాలను ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పోర్టల్‌లో సక్రమంగా నమోదు చేయాలి. అన్ని వివరాలు సరైనవిగా ఉన్నప్పుడే కొత్త విధానం ద్వారా నగదు పొందే అవకాశం ఉంటుంది. ఈ మార్పుతో నగదు ఉపసంహరణ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. అందువల్ల సభ్యులు తమ వ్యక్తిగత వివరాలు, పత్రాలను ముందుగానే సరిచూసుకోవాలని సూచిస్తున్నారు. అయితే 'ఈపీఎఫ్ఓ 3.0' సేవలను ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై ఇప్పటివరకు అధికారిక తేదీ ప్రకటించలేదు. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే మొబైల్ ఫోన్ ద్వారా నగదు పొందే అవకాశం కలగనుంది. అత్యవసర ఆర్థిక అవసరాల సమయంలో ఈ సౌకర్యం ఉద్యోగులకు మరింత ఉపయోగపడనుందని భావిస్తున్నారు.

# నోవా సిరీస్‌కు భారీ ఆదరణ


**న్యూఢిల్లీ, జూన్ 30 :** ప్రముఖ సాంకేతిక సంస్థ 'ఏఐ ప్లస్' విడుదల చేసిన 'నోవా-2 నియో', 'నోవా-2 ప్రో' స్మార్ట్‌ఫోన్లకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. ఇటీవల మార్కెట్లోకి వచ్చిన ఈ రెండు మోడళ్లు తొలి విక్రయంలోనే పూర్తిగా అమ్ముడుపోవడంతో సంస్థ మరోసారి విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 30న మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రముఖ ఈ-వాణిజ్య వేదిక ద్వారా ఈ ఫోన్లు మరోసారి వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. జూన్ 22న నిర్వహించిన ప్రత్యేక ఆవిష్కరణ కార్యక్రమంలో ఈ రెండు స్మార్ట్‌ఫోన్లను ఘనంగా విడుదల చేశారు. అనంతరం జూన్ 26న జరిగిన తొలి విక్రయంలోనే వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన రావడంతో అందుబాటులో ఉన్న అన్ని యూనిట్లు క్షణాల్లో అమ్ముడయ్యాయి. ఈ స్పందనతో ఉత్సాహం చెందిన సంస్థ మరో విడత విక్రయాలను ప్రకటించింది. నోవా-2 నియో మోడల్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ఐదో తరం మొబైల్ నెట్‌వర్క్ ప్రాసెసర్, 120 హెర్ట్జ్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 6000 ఎంఏహెచ్ సామర్థ్యమున్న భారీ బ్యాటరీని అందించారు. నోవా-2 ప్రో మోడల్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్‌తో పాటు 144 హెర్ట్జ్ ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. రెండు ఫోన్లలోనూ సరికొత్త ఆండ్రాయిడ్ 16 ఆధారిత స్వచ్ఛమైన సాఫ్ట్‌వేర్ వ్యవస్థను అందించడంతో పాటు, 48 మెగాపిక్సెల్ సోనీ సెన్సార్ కెమెరాను అమర్చారు. దీంతో పనితీరు, బ్యాటరీ సామర్థ్యం, చిత్రాల నాణ్యత పరంగా ఈ ఫోన్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి మాధవ్ షేత్ మాట్లాడుతూ, అందుబాటు ధరలో అత్యుత్తమ సాంకేతికత, నాణ్యమైన రూపకల్పన, మెరుగైన వినియోగ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నోవా సిరీస్‌ను రూపొందించినట్లు తెలిపారు. తొలి విక్రయానికి లభించిన అపూర్వ స్పందన తమపై వినియోగదారులు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. రెండో విడత విక్రయాల ద్వారా దేశవ్యాప్తంగా మరింత మంది వినియోగదారులకు నోవా సిరీస్‌ను చేరవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఇన్నోసెంట్ కైయా' సెంచరీ

- బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ తేడాతో జింబాబ్వే ఘన విజయం.!
- ఇన్నింగ్స్ 85 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చిత్తు





**హరారే, జూన్ 30:** హరారే వేదికగా జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు అన్ని విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో బంగ్లాదేశ్‌ను ఇన్నింగ్స్ 85 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఓపెనర్ ఇన్నోసెంట్ కైయా కెరీర్‌లో తొలి టెస్టు సెంచరీతో చెలరేగగా, బౌలర్లు సమిష్టిగా రాణించి జింబాబ్వేకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇన్నోసెంట్ కైయా 227 బంతుల్లో 17 ఫోర్లతో 140 పరుగులు చేసి జింబాబ్వే భారీ స్కోరుకు పునాది వేశాడు. బ్రియాన్ బెన్నెట్ (59), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (60), వెస్లీ మధేవెరే అజేయంగా 77 పరుగులు చేయడంతో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఎదుర్కొన్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (60) మినహా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో కేవలం 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఫాలోఆన్ ఆడిన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ నిలదొక్కుకోలేక 185 పరుగులకే కుప్పకూలింది. ముష్ఫికుర్ రహీమ్ (34), కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (30) కొంత ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టగా, రిచర్డ్ నగరవా మూడు వికెట్లు తీసి విజయాన్ని ఖాయం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ నగరవా, ముజరబాని, న్యూమన్ న్యాంహూరి అద్భుత బౌలింగ్‌తో బంగ్లాదేశ్‌ను కట్టడి చేశారు. ఇదిలా ఉండగా, ఇన్నోసెంట్ కైయా ఇటీవల అసాధారణ ఫామ్‌లో కొనసాగుతున్నాడు. గత 11 ఇన్నింగ్స్‌ల్లో ఏడు సెంచరీలు బాదిన ఈ 33 ఏళ్ల బ్యాటర్, 2026 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 110కు పైగా సగటుతో 995 పరుగులు సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆలస్యంగా అరంగేట్రం చేసిన కైయా ఇప్పటివరకు మూడు టెస్టుల్లో ఒక సెంచరీ, ఒక అర్ధసెంచరీ నమోదు చేయగా, వన్డేల్లో 450, టీ20ల్లో 290 పరుగులు చేశాడు. ప్రస్తుతం జింబాబ్వే క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా నిలుస్తున్నాడు.

# మహిళల టీ20 సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా-వెస్టిండీస్ పోరు




**లండన్, జూన్ 30 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు తలపడబోతున్నాయి. లండన్‌లోని ది ఓవల్ మైదానంలో ఈ కీలక మ్యాచ్ జరగనుంది. రాత్రి 7:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోరు ఫైనల్‌కు చేరే జట్టును నిర్ణయించనుండటంతో క్రికెట్ ప్రపంచం మొత్తం ఈ మ్యాచ్‌పై దృష్టి పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా ఈ టోర్నీలో అద్భుత ఫామ్‌లో ఉంది. లీగ్ దశలో ఒక్క ఓటమి కూడా లేకుండా సెమీఫైనల్‌కు చేరి తన ఆధిపత్యాన్ని చూపించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా బలంగా ఉన్న ఈ జట్టు టైటిల్ గెలిచే ప్రధాన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.ఇక హేలీ మాథ్యూస్ నాయకత్వంలోని వెస్టిండీస్ జట్టు కూడా పోరాట పటిమతో సెమీఫైనల్‌కు చేరింది. కొన్ని మ్యాచ్‌ల్లో ఇబ్బందులు ఎదురైనా కీలక సమయాల్లో రాణించి ముందుకు సాగింది. 2016లో ఆస్ట్రేలియాపై ఫైనల్ విజయం సాధించిన అనుభవంతో ఈసారి కూడా సంచలనం సృష్టించాలని ఆ జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.



# ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ ఆండ్రీవాకు వింబుల్డన్‌లో ఘన ఆరంభం

**లండన్, జూన్ 30 :** ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ మీర్రా ఆండ్రీవా వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తన జోరును కొనసాగిస్తూ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో పోలండ్‌కు చెందిన మాగ్డా లినెట్‌పై 7-5, 6-4 సెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన 19 ఏళ్ల ఆండ్రీవా ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. కీలక పాయింట్లలో స్థిరమైన ప్రదర్శన కనబరుస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చూపించింది. మొదటి సెట్‌లో తీవ్ర పోరాటం జరిగినప్పటికీ, కీలక గేమ్‌లను తనవైపు తిప్పుకుని సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తూ మ్యాచ్‌ను 7-5, 6-4తో ముగించింది. ఈ విజయంతో ఆమె రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టగా, అక్కడ ఆమెకు మరింత కఠిన పరీక్ష ఎదురుకానుంది. డిఫెండింగ్ వింబుల్డన్ ఛాంపియన్ బార్బోరా క్రెజికోవాతో ఆమె తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఇప్పటినుంచే టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. గతేడాది వింబుల్డన్‌లో ఆండ్రీవా క్వార్టర్ ఫైనల్ వరకు అద్భుతంగా రాణించి, ఆఖరి దశలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆ అనుభవంతో ఈసారి మరింత పటిష్టంగా బరిలోకి దిగిన ఆమె, టైటిల్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌లో తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించిన ఆండ్రీవా, అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన రెండో మహిళా టెన్నిస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. వింబుల్డన్ మాజీ ఛాంపియన్ కొన్చితా మార్టినెజ్ శిక్షణలో రాణిస్తున్న ఆమె, ప్రస్తుతం ప్రపంచ టెన్నిస్‌లో అత్యంత వేగంగా ఎదుగుతున్న యువ సంచలనంగా నిలుస్తోంది.

# వరల్డ్ కప్‌లో భారత్‌కు నిరాశ

## ర్యాంకింగ్స్‌లో తెలుగు అమ్మాయి హవా!

### ఐసీసీ టీ20 బౌలింగ్‌లో అగ్రస్థానం నిలబెట్టుకున్న శ్రీ చరణి

### వరల్డ్ కప్‌లో 14 వికెట్లతో మెరిసిన యువ స్పిన్నర్

**న్యూఢిల్లీ, జూన్ 30:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు సెమీఫైనల్‌కు చేరుకోలేకపోయినా.. తెలుగు యువ స్పిన్నర్ శ్రీ చరణి మాత్రం తన అద్భుత ప్రదర్శనతో ప్రపంచ క్రికెట్‌లో సత్తా చాటింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన తాజా మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీ చరణి బౌలర్ల జాబితాలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రపంచకప్‌లో మొత్తం 14 వికెట్లు తీసి అత్యుత్తమ ప్రదర్శన చేసిన శ్రీ చరణి.. ఆస్ట్రేలియాతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లోనూ రెండు వికెట్లు పడగొట్టి తన స్థిరమైన ప్రదర్శనను కొనసాగించింది. భారత జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ ఆమె వ్యక్తిగత ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి.

### బౌలర్ల జాబితాలో మార్పులు

టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ ఒక స్థానం మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకుంది. ఆమె సహచర బౌలర్ లారెన్ బెల్ మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌ను దక్కించుకుంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ నాన్కులులేకో మ్లాబా ఐదో స్థానానికి చేరుకోగా, పాకిస్థాన్ బౌలర్ నష్రా సంధు తొమ్మిదో స్థానంలో నిలిచింది. మారిజానే కాప్, బ్రీ ఇల్లింగ్ కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు.

### బ్యాటర్లలో వోల్ నంబర్ వన్

మహిళల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా స్టార్ జార్జియా వోల్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, బెత్ మూనీ రెండో స్థానంలో నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ మూడో స్థానానికి చేరుకుంది. శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు ఏడో స్థానంలోకి ఎగబాకగా, ఇంగ్లాండ్ ఓపెనర్ డ్యానీ వ్యాట్ హాడ్జ్ 11వ స్థానానికి చేరుకుంది. భారత్‌పై అర్ధశతకం సాధించిన ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 17వ ర్యాంక్‌ను దక్కించుకుంది.

### ఆల్‌రౌండర్లలో హేలీ మాథ్యూస్ అగ్రస్థానం

ఆల్‌రౌండర్ల విభాగంలో వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, న్యూజిలాండ్ స్టార్ అమేలియా కెర్ రెండో స్థానంలో నిలిచింది. ఐర్లాండ్‌కు చెందిన ఓర్లా ప్రెండర్‌గాస్ట్ సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకుంది. మారిజానే కాప్, అన్నాబెల్ సదర్లాండ్ కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. ఇదిలా ఉండగా.. మహిళల టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు అర్హత సాధించాయి. లండన్‌లోని కెనింగ్టన్ ఓవల్ వేదికగా తొలి సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా-వెస్టిండీస్ జట్లు తలపడనున్నాయి.



# ఆసియా క్రీడల కోసం భారత మహిళల క్రికెట్ జట్టు ప్రకటన

**న్యూఢిల్లీ, జూన్ 30 :** రాబోయే 2026 ఆసియా క్రీడల కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన భారత మహిళల క్రికెట్ జట్టును ప్రకటించింది. జపాన్‌లోని ఐచి--నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ కొనసాగుతుండగా, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ జట్టులో ఒకే ఒక్క మార్పు చేస్తూ, వికెట్ కీపర్ యస్తికా భాటియా స్థానంలో యువ వికెట్ కీపర్ జి. కమలినికి అవకాశం కల్పించారు. మిగతా జట్టు యథాతథంగా కొనసాగడం జట్టు కూర్పులో స్థిరత్వాన్ని సూచిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ కీలక పాత్ర పోషించనున్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ జట్టుకు సమతూకం తీసుకురానుండగా, వికెట్ కీపింగ్ బాధ్యతలను రిచా ఘోష్ ప్రధానంగా నిర్వర్తించనుంది. ఆమెకు బ్యాకప్‌గా కమలిని ఎంపికయ్యారు. బౌలింగ్ విభాగంలో రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి పేస్ విభాగాన్ని నడిపించనుండగా, స్పిన్ విభాగంలో రాధా యాదవ్, శ్రీ చరణి కీలకంగా నిలవనున్నారు. అయితే యువ ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్ ఎంపిక ఆమె ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. భారత మహిళల జట్టు గత ఎడిషన్‌లో స్వర్ణ పతకం సాధించిన విషయం తెలిసిందే. అదే విజయాన్ని కొనసాగిస్తూ ఈసారి కూడా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బలమైన ప్రదర్శన ఇవ్వాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.



స్టార్ ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్న

# అనన్య నాగళ్ల



తెలుగు సినీ పరిశ్రమలో తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, స్టార్‌డమ్ మాత్రం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలిన కథానాయికల్లో అనన్య నాగళ్ల ఒకరు. సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఈ తెలుగు అమ్మాయి, ప్రస్తుతం పెద్ద అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. సినిమాల్లోకి రాకముందు అనన్య నాగళ్ల సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేశారు. నటనపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి సినీ రంగంలో అడుగుపెట్టారు. ప్రారంభంలో కొన్ని షార్ట్ ఫిల్మ్‌లలో నటించిన ఆమె, అనంతరం 'మల్లేశం' చిత్రంతో కథానాయికగా పరిచయమై తొలి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన 'వకీల్ సాబ్' చిత్రంలో కీలక పాత్ర పోషించి మరింత గుర్తింపు పొందారు. అనంతరం వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ, కెరీర్‌కు పెద్ద మలుపు తిప్పే విజయాన్ని మాత్రం అందుకోలేకపోయారు. అయినప్పటికీ ప్రతి సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ అనన్య నాగళ్ల చురుగ్గా ఉంటున్నారు. తరచూ కొత్త ఫొటోషూట్లు, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ మంచి ఆదరణ పొందుతున్నారు. ఇటీవల గ్లామర్ ఫొటోషూట్లతో కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రస్తుతం మంచి కథలతో పాటు స్టార్ హీరోల సరసన నటించే అవకాశాల కోసం అనన్య ఎదురుచూస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక పెద్ద ప్రాజెక్టులో అవకాశం దక్కితే ఆమె కెరీర్‌కు కొత్త ఊపు వస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# టాక్సిక్ ఓ అద్భుతమైన అనుభం

## నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు




'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్‌ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్‌గా ఉండనుందని స్పష్టం చేశారు. ఈ సినిమాలో యశ్‌తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయ్యాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయని హ్యూమా అన్నారు. ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించారు. కియార, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.



# ప్రేమా? ప్రచారమా?

## రాఘవ్-నిహారిక ఫొటోలు వైరల్..

ప్రముఖ డాన్సర్, నటుడు రాఘవ్ జుయల్, నటి, కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్ఎమ్ తాజాగా పంచుకున్న ఇన్‌స్టాగ్రామ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇద్దరూ అత్యంత సన్నిహితంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకున్న చిత్రాలను ఉమ్మడిగా పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ పోస్టుకు ఎలాంటి వివరణ ఇవ్వకుండా కేవలం కొన్ని ఎమోజీలను మాత్రమే జత చేయడంతో, వీరిద్దరూ తమ ప్రేమ బంధాన్ని అధికారికంగా ప్రకటించారా? లేక ఇది కొత్త సినిమా ప్రచారంలో భాగమా? అనే చర్చ మొదలైంది. పోస్టు వెలువడిన వెంటనే అభిమానులు, సినీ వర్గాల్లో దీనిపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఫొటోల్లో నిహారిక ఎరుపు రంగు స్వెట్‌షర్ట్‌లో, రాఘవ్ బూడిదరంగు జాకెట్‌లో కనిపించారు. ఇద్దరి మధ్య కనిపించిన అనుబంధాన్ని చూసి పలువురు అభిమానులు ముందుగానే శుభాకాంక్షలు తెలుపుతుండగా, మరికొందరు ఇది ప్రచార వ్యూహమేనని అభిప్రాయపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం, వీరిద్దరూ కలిసి నటిస్తున్న 'భాయ్ తేరా స్టార్ హై' చిత్ర ప్రచారంలో భాగంగానే ఈ పోస్టు చేసినట్లు పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమా విడుదలకు ముందే ఆసక్తి పెంచేందుకు ఇలాంటి ప్రచార పద్ధతులను ఇటీవల ఎక్కువగా అనుసరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇక రాఘవ్ జుయల్ తన కెరీర్‌ను డాన్స్ రియాలిటీ షోలతో ప్రారంభించి, ఆ తర్వాత నటుడిగా గుర్తింపు పొందారు. పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించిన ఆయన ఇటీవల పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మరోవైపు నిహారిక ఎన్ఎమ్ కూడా డిజిటల్ వేదికలపై తన ప్రత్యేక శైలితో విస్తృత ఆదరణ పొందుతున్నారు. అయితే ఈ ఫొటోలపై రాఘవ్ జుయల్, నిహారిక ఎన్ఎమ్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. దీంతో ఇది వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రకటనా? లేక సినిమా ప్రచార వ్యూహమా? అన్నది తెలియాలంటే వారి అధికారిక స్పందన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



# నాగబంధంలో అద్భుతమైన పాత్ర నాది

## నటి నభా నటేశ్ ఆసక్తిక విషయాలు వెల్లడి

నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com